ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 31.0

కనిష్ఠం : 23.0

# మొంథా

# యంత్రాంగం అప్రమత్తం

## నష్ట నివారణపై దృష్టి సారించండి

అధికారులతో మంత్రి పార్థసారథి వర్చువల్ సమీక్ష



నూజివీడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా రానున్న మూడు రోజుల్లో ఈదురు గాలులతో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, ముందస్తు జాగ్రత్తలపై అధికారులు అప్రమత్తంగా మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. జిల్లాస్థాయి అధికారులతో మంత్రి ఆదివారం వర్చువల్ సమీక్ష నిర్వహించారు. ఈదురు గాలులకు ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం కలగకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.

### నూజివీడు, కైకలూరులో భారీ వర్షాలు

తుఫాన్ సమయంలో నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలలో క్లౌడ్ బరస్ట్ రీతిలో భారీ వర్షం కురవవచ్చని, ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలను రక్షించేందుకు బోట్లు, గతఈతగాళ్లను సిద్ధం చేయాలని అగ్నిమాపక అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



పెద్దఎడ్లగాడి వద్ద కొల్లేరు వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్

### కొల్లేరు వరద పరిశీలన

మండవల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో కొల్లేరు వరద ఉధృతిని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదివారం పరిశీలించారు. ఎగువ నుంచి వస్తున్న వరద నీరు దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా తూడు గుర్రపుడెక్కను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, తహసీల్దార్ గోపాల్, సీఐ రవికుమార్, ఎస్సై పాల్గొన్నారు.

- అధికారులతో కలెక్టర్, ఎస్పీ సమీక్ష
- జిల్లాకు ఎస్‌డీఆర్‌ఎఫ్ బలగాలు
- అన్ని మండలాల్లో కంట్రోల్ రూమ్స్
- జిల్లాకు ప్రత్యేకాధికారి నియామకం
- గ్రామానికి ఒక నోడల్ అధికారి

ఏలూరు సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం మొంథా తుఫాన్‌గా బలపడుతోంది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ నెల 27న జిల్లాకు ఎల్లో అలర్ట్, 28, 29 తేదీల్లో రెడ్ అలర్ట్‌లను విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. తుఫాన్ కారణంగా బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తుఫాన్ ప్రభావంపై కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎస్పీతో కలిసి అధికారులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అప్రమత్తం చేశారు.

### అధికారులతో కలెక్టర్ సమీక్ష

జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావంతో ఈ నెల 27 నుంచి 29 వరకు తీవ్ర గాలులు, భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై ఎస్పీతో కలిసి ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను అప్రమత్తం చేశారు. తుఫాన్ సమయంలో 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని, హోర్డింగ్‌లు, ఆస్బెస్టాస్ రేకులు, ఐరన్‌రేకులు ఎగిరిపోయే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గోదావరి నదిలో పర్యాటక లాంచీలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని మండల, డివిజన్ స్థాయిలో

మిగతా 8వ పేజీలో..

## ఈదురు గాలులు.. భారీ వర్షాల హెచ్చరిక

పోలవరంలో నిలిపివేసిన పర్యాటక బోట్లు



### జిల్లా ప్రత్యేకాధికారిగా కాంతీలాల్ దండే

మొంథా తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో జిల్లాలో సహాయక చర్యలు పర్యవేక్షించడానికి ప్రత్యేకాధికారిగా కాంతీలాల్ దాండేను ప్రభుత్వం నియమించింది. అదేవిధంగా జోనల్ ఇన్‌చార్జిగా అర్‌పి సిసోడియా వ్యవహరిస్తారని ప్రభుత్వం ప్రకటించింది.

### పాపికొండల పర్యాటక బోట్ల రాకపోకలు బంద్

పోలవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాను హెచ్చరిక నేపథ్యంలో లాంచీలు, పాపికొండల పర్యాటక బోట్లు నిలిపివేయాలని డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం రేవులను ఆదివారం ఆయన పరిశీలించి బోట్ల నిర్వహకులు, రేవు లాంచీల యజమానులకు హెచ్చరికలు చేశారు. తుఫాను ప్రభావం తగ్గేవరకూ లాంచీలు, బోట్లు రాకపోకలు సాగించరాదని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్తీక స్నానాలు చేసే భక్తులు నదిలో దిగరాదని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. గుంజవరం, తానాలకుంట, రేపల్లెవాడ, ప్రగడపల్లి గ్రామాల పరిధిలో కొండవాగులు కాలువలు దాటే ప్రయత్నాలు చేయరాదన్నారు. ఆయన వెంట సీఐ బాల సురేశ్, ఎస్‌ఐ పవన్‌కుమార్ ఉన్నారు.

### సముద్ర తీరంలో హై అలర్ట్

నరసాపురం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో తీర ప్రాంత ప్రజలను సముద్రం వద్దకు వెళ్లరాదని అధికారులు హెచ్చరించారు. నరసాపురం-సఖినేటిపల్లి రేవులను ఆదివారం మూసివేసి పంటు, పడవల రాకపోకల్ని నిలిపివేశారు. తుఫాన్ భవనాలను సిద్ధం చేస్తున్నారు. బలమైన గాలులకు అలలు ఎగసిపడే అవకాశం ఉన్నందున్న మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచ్చిఆరు. వేట సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. మరోవైపు తుఫాన్ కృష్ణా, కోనసీమ జిల్లాల మధ్య తీరం దాటే అవకాశం ఉండడంతో ఆ ప్రభావం తీర ప్రాంతంపై ఏ మేరకు ఉంటుందోనన్న భయం స్థానికుల్లో నెలకొంది.

### అండగా పోలీస్ శాఖ : ఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను హెచ్చరిక నేపథ్యంలో అత్యవసర పరిస్థితి ఎదురైతే ప్రజలకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. అతి భారీ వర్షాలు, వేగంగా గాలులు వీచే అవకాశాలు ఉన్న దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అకస్మాత్తుగా వాగులు, వంకలు, కాలువలు పొంగి పొర్లే అవకాశం ఉందని, దాటే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు కాల్ చేస్తే పోలీసులు వెంటనే వచ్చి సహాయం చేస్తారన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.

### వైద్యులు అందుబాటులో ఉండాలి

ఏలూరు అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను హెచ్చరిక ప్రాంతాల్లో పీహెచ్‌సీ వైద్యులంతా 24/7 ప్రాతిపదికన నిరంతరం అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి పీజే.అమృతం ఆదేశించారు. జిల్లాలోని 62 పీహెచ్‌సీలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో ఆదివారం జూమ్ సమావేశం నిర్వహించారు. మొంథా తుఫాను ప్రభావం జిల్లాలో 153 సచివాలయాల పరిధిలో ఉండవచ్చని వాతావరణ శాఖ నుంచి సమాచారం అందినట్లు తెలిపారు. ఆ మేరకు రెడ్అలర్ట్ ప్రాంత పీహెచ్‌సీల వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణులు, బాలింతలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వైద్య పర్యవేక్షణకు వీలుగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఔషధాలు, కుక్క, పాము కాటు వ్యాక్సిన్‌లను అన్ని పీహెచ్‌సీల్లో నిల్వలు ఉంచామన్నారు. పీహెచ్‌సీల్లో వైద్య సేవల పర్యవేక్షణకు ప్రోగ్రాం ఆఫీసర్లకు అదనపు బాధ్యతలు అప్పగించామన్నారు. తుఫాన్ పర్యవేక్షణకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### విద్యా సంస్థలకు 2 రోజులు సెలవు

ఏలూరు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో ఏలూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జారీచేసిన ఆదేశాలను డీఈవో వెంకటలక్ష్మమ్మ ఇంటర్మీడియట్, ఉన్నత విద్యా శాఖల జిల్లా అధికారులకు తెలియజేశారు. జిల్లాలోని అన్ని పాఠశాలలతోపాటు జూనియర్ కళాశాలలు, డిగ్రీ, పీజీ కళాశాలలకు సెలవు వర్తిస్తుందని, ఆయా శాఖల రాష్ట్ర అధికారులు సమాచారం పంపారు. ఈ రెండు రోజుల్లో ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలలు సహా ఎవరైనా స్టడీ క్లాసులు, ప్రత్యేక తరగతులను నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### నేడు పీజీఆర్ఎస్ రద్దు

ఏలూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా సోమవారం కలెక్టరేట్, డివిజన్, మండల, మున్సిపల్ కేంద్రాల్లో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు,ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.



పూడ్చిన గండి నుంచి బయటకు వెళుతున్న ఊట నీరు

## భయపెడుతున్న పెద్ద చెరువు

- గట్టు బలహీనం
- గత ఏడాది గండి.. పూడ్చివేత
- తుఫాన్ హెచ్చరికతో ఆందోళన

నూజివీడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెద్దచెరువు గట్టు బలహీనంగా ఉండడంతో తుఫాను హెచ్చరిక నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఇదే సమయంలో చెరువుకు గండిపడి పట్టణం నీట మునిగింది. ఇటీవల గండిని తూతూమంత్రంగా మట్టితో కప్పి ఉంచారు. కొద్దిరోజులుగా పడుతున్న వర్షాలకు గండి నుంచి ఊట నీరు ఉబుకుతోంది. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు పడితే ముంపు తప్పదని కొప్పుల వెలమపేట, నూజివీడులోని ముంపుప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### 200 ఎకరాల చెరువు

200 ఎకరాల విస్తీర్ణంతో ఉన్న చెరువు నిర్వహణ గత కొన్నేళ్లుగా లోపభూయిష్టంతో ఉంది. గత ఏడాది భారీ వర్షాలకు 24 గంటల్లో చెరువు పూర్తిగా నిండి చెరువుకట్ట రెండుచోట్ల తెగి నీరు ముంచెత్తింది.

### గండి పూడ్చివేతలో జాప్యం

ఏడాది క్రితం చెరువుకు పడిన గండిని పక్కాగా పూడ్చడానికి ఇంతవరకు పటిష్ఠ చర్యలు తీసుకోలేదు. నాడు నూజివీడుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక చెరువులకు గండ్లుపడ్డాయి. వాటిని యుద్ధప్రాతిపదికన ప్రభుత్వం పూడ్చి రక్షణ చర్యలు చేపట్టింది. నూజివీడు చెరువు గండిని పూడ్చడానికి జాప్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై సిమెంట్‌గోడ నిర్మాణాల పేరుతో ప్రభుత్వానికి సకాలంలో నివేదికలు పంపకపోవడం వల్ల నిధులు మంజూరు కాలేదు. 2 నెలల క్రిందట ఒక కాంట్రాక్టర్‌తో చెరువులోని మట్టితోనే గండిని పూడ్చి ఇసుక బస్తాలువేసి అధికారులు మమ అనిపించారు. ఇటీవల వర్షానికి గండి వద్ద నీరు ఉబుకుతోంది. ప్రస్తుతం తుఫాన్ హెచ్చరికతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

చెరువులో నీరు లేకపోవడంతో అధికార పార్టీ నేతలు మట్టి తోలకాలకు తెరతీశారు. మధ్యలో వర్షం నీటిని కట్ట బలహీనంగా ఉందనే నెపంతో చెరువు నీటిమట్టాన్ని తగ్గించటానికి చెరువు కళింగను సైతం పగుల కొట్టి నీటిని కిందికి వదిలే విధంగా చేశారు. గండిపడిన ప్రాంతంలో తాత్కాలిక మట్టి కట్ట నుంచి ఊటనీరు దిగుతుండడంతో కొప్పువెలమపేట ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రాట్.. ఉపాధ్యాయ సంఘాలు విముఖం

- టెట్ రివ్యూ పిటిషన్‌కు ఆలోచన
- రాష్ట్ర కమిటీకి జిల్లా ఉపాధ్యాయ సంఘాల సూచన

భీమవరం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టెట్ పరీక్ష ఉత్తీర్ణత ఉపాధ్యాయులకు తప్పనిసరి అనే సూచనను ఉపాధ్యాయ సంఘాలు విముఖంగా ఉన్నాయి. టెట్ పరీక్ష నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఉపాధ్యాయ సంఘాలు సమావేశాల్లో నిమగ్నమయ్యారు. మొన్న ఫ్యాప్టో, ఆదివారం పీఆర్‌టీయూ ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పీఆర్‌టీయూ జిల్లా సంఘం కోర్టు ఇచ్చిన తీర్పును రివ్యూ చేయవలసినదిగా రాష్ట్ర కమిటీని కోరడం జరిగింది. మొత్తం మీద ఉపాధ్యాయుల సంఘాలు ఉపాధ్యాయులకు టెట్‌పై రివ్యూ పిటిషన్ రాష్ట్ర ప్రభుత్వం వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 5 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ అర్హత తప్పనిసరిగా మారింది. వీరిలో చాలా మంది 30 ఏళ్ల పైబడి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. గతంలో పదోన్నతి కోసం పరీక్షలు పాసై ప్రమోషన్లు పొందామన్నారు. అలాంటి వారికి టెట్ పరీక్ష రాయాలని మాటలు వినిపిస్తున్నాయి.



### నేడు సహకార ఉద్యోగుల ఆందోళన

సామూహిక సెలవు



### మార్కెట్‌లో నాఫెడ్ ఉల్లి

మహారాష్ట్ర నుంచి 90 టన్నులు

క్వింటా రూ.వెయ్యి నుంచి 1500

### బాస్కెట్ బాల్ జిల్లా మహిళా జట్టు ఎంపిక

లోపలి పేజీల్లో..

## ఎక్కడి బస్సులు అక్కడే.. గప్‌చుప్!




### కొనసాగుతున్న రవాణా శాఖ తనిఖీలు

- కొన్ని బస్సుల నిలిపివేత?
- బుకింగ్ కార్యాలయాలు మూత
- టిక్కెట్లు లేవని సమాధానం
- నిర్వాహకులకు కేసుల భయం!

ఏలూరు క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సులు వెళ్లని, నడపలేని మార్గాల్లో సైతం ప్రైవేటు బస్సులు రయ్‌న దూసుకుపోతాయి. ఆ మార్గాలు ప్రైవేటు ఆధీనంలో ఉంటాయి.. ఆదాయ మార్గాలను అన్వేషిస్తారు. బస్సులను రిజిస్ట్రేషన్‌లో చార్జీలు ఏ రాష్ట్రంలో తక్కువైతే అక్కడ స్థానికులుగా వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయించగలరు. నేషనల్ పర్మిట్ పొంది దేశంలో ఏ ప్రాంతానికైనా బస్సులను తిప్పగలరు. ప్రైవేటు ట్రావెల్స్ దందా ఇది. కర్నూలులో బస్సు దహనం సంఘటన నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. దీనితో కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఎక్కడికక్కడే నిలిపివేశారు.

వాస్తవానికి కాంట్రాక్టు అండ్ క్యారేజీ పేరుతో రిజిస్ట్రేషన్ అవుతున్న బస్సులు స్టాపేజీ ప్రకారం వెళ్లకూడదు. కానీ ఒకే వ్యక్తి కాంట్రాక్టుకు బస్ బుక్ చేసుకున్నారని, అతడి పాసింజర్లు ఆయా ప్రాంతాల్లో ఎక్కి దిగుతారంటూ చెప్పుకొస్తారు. ప్రజల సౌకర్యార్థం ప్రజారవాణాకు ఉపయోగపడుతున్నాయని అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇదే అదునుగా తీసుకున్న కొంతమంది ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు అతి తెలివితో ఒక బస్సును రిజిస్ట్రేషన్ చేయించి అదే నెంబర్‌తో మరో బస్సును అదే రూటులో ఆపోజిట్ మార్గాల్లో తిప్పుతున్న సంఘటనలు గతంలో రవాణాశాఖ అధికారుల తనిఖీల్లో బయటపడ్డాయి. కొన్ని బస్సులకు సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో వాటిపై తరచుగా కేసులు రాస్తూ జరిమానా విధిస్తూనే ఉన్నారు. ఎవరైనా ఎక్కువ చార్జీలు వసూలు చేసినా సహించేది లేదంటూ రవాణాశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా పండుగ సమయాలు, వివిధ సందర్భాల్లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు నిర్వాహకులు అందిన కాడికి అడ్డంగా దోచేసుకుంటున్నారు. ఆ వాహనాలను సీజ్ చేస్తే ప్రయాణికులు ఇబ్బంది పడతారనే కారణంతో అధికారులు హెచ్చరికలు జారీ చేసి వదిలివేస్తున్నా రద్దీ సమయాల్లో అధిక ధరతో ప్రయాణికులను దోచేస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు.

### రూ.62.25 లక్షల జరిమానా

జిల్లాలో రవాణాశాఖ అధికారులు ఈ ఏడాది ఇప్పటి వరకూ 1001 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.62.25 లక్షల జరిమానా వసూలు చేశారు. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో రవాణాశాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో వారి రోజువారీ తనిఖీలతో పాటు ప్రైవేటు బస్సులపై రాత్రివేళ రహదారులపై రవాణాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలను కొనసాగిస్తూనే ఉన్నారు. ఎక్కువగా ఏలూరు మీదుగా వంద బస్సులు పైగా ప్రతి రోజు నడుస్తున్నట్లు గుర్తించారు. హైదరాబాద్ నుంచి జంగారెడ్డిగూడెం మీదుగా రాజమండ్రి వైపు మరో వంద బస్సులు నడుస్తున్నట్లు తెలుస్తోంది. ప్రయాణికులు టిక్కెట్లు బుకింగ్ చేసుకోవడానికి వీలుగా ఆయా ట్రావెల్స్‌కు ఏలూరు నగరంలో 12 కార్యాలయాలు, జంగారెడ్డిగూడెంలో నాలుగు

మిగతా 8వ పేజీలో..

## అర్హులకు ఇళ్లు



- మారిన మార్గదర్శకాలు
- ఆవాస్ ప్లస్ యాప్‌లో దరఖాస్తు
- సచివాలయాల్లో అందజేయాలి

ఏలూరు సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు పీఎంఏవై-అర్బన్ 2.0లో గృహాల మంజూరుపై కేంద్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారు ఆవాస్‌ప్లస్ 2024 మొబైల్ యాప్ ద్వారా దగ్గరలోని గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రానున్న రోజుల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని మండలాలు, గ్రామాల్లో అర్హులకు పిఎంఏవై-యు 2.0లో గృహాలు మంజూరుకు అవకాశం లేదని చెబుతున్నారు. అర్హత కలిగి, ఇంటి నిర్మాణం చేపట్టటానికి సిద్ధంగా ఉన్న వారి వివరాలను గ్రామీణ పథకంలో మంజూరు చేస్తారు. గ్రామ సచివాలయ పరిధిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్/ గృహనిర్మాణ సంస్థ ఏఈ / మండల ఇన్‌చార్జి ద్వారా ఆవాస్ ప్లస్ 2024 మొబైల్ యాప్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఇంతకు ముందు సొంత స్థలం ఉండి ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారు కూడా ఈ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే జిల్లాలో దరఖాస్తు చేసుకున్న వారు 24 వేల మంది వరకు ఉన్నారని జిల్లా గృహనిర్మాణ సంస్థ నివేదికలు చెబుతున్నాయి. నూతన మార్గదర్శకాల ప్రకారం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని మండలాలలోని గ్రామాలతోపాటు రూరల్ గ్రామాల్లో లబ్ధిదారులు కూడా ఈ విధానం ప్రకారమే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గృహనిర్మాణ సంస్థ పీడీ జి సత్యనారాయణ కోరుతున్నారు.

### అర్హతలు ఇవీ..

- సొంత స్థలం కలిగి, ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ , దస్తావేజు లేదా ఇంటి పట్టా కలిగి ఉండాలి.
- దరఖాస్తుదారు సొంత పక్కా గృహం కలిగి ఉండరాదు, గృహ నిర్మాణ పథకంలో లబ్ధిపొంది ఉండరాదు.
- దరఖాస్తుదారు నెలసరి ఆదాయం రూ.15వేలకు మించి ఉండరాదు.
- నాలుగు చక్రాల వాహనం కలిగి ఉండరాదు.
- ప్రభుత్వ ఉద్యోగం కలిగి ఉండరాదు.
- ఆదాయపుపన్ను / ప్రొఫెషనల్ టాక్స్ కలిగి ఉండరాదు.
- మండల పరిధిలో వ్యవసాయ భూమి 2ఎకరాలు/ మెట్ట భూమి 5 ఎకరాల్లోపు ఉండాలి.

అర్హత కలిగిన వారందరు సచివాలయం పరిధిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ / వెల్ఫేర్ అసిస్టెంట్ లేదా సంబంధిత మండల గృహ నిర్మాణ సంస్థ ఏఈ/ మండల ఇన్‌చార్జిని సంప్రదించి నవంబరు 5లోపు నమోదు చేసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పూర్తి సబ్సిడీపై ఇల్లు మంజూరవుతుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని హౌసింగ్ అధికారులు సూచిస్తున్నారు.

### వచ్చే నెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలి

కొత్తగా ఇంటి మంజూరుకు దరఖాస్తు చేయడానికి మార్గదర్శకాల్లో మార్పులు చేశారు. ఇల్లు నిర్మాణం చేపట్టాలనుకునే వారు ఆవాస్ ప్లస్ 2024 మొబైల్ యాప్ ద్వారా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. నవంబరు 5లోపు దరఖాస్తు అందజేయాలి.

– జి.సత్యనారాయణ, పీడీ, గృహనిర్మాణ సంస్థ

# తగ్గని చికెన్ ధరలు

**కానరాని కార్తీక మాసం ఎఫెక్ట్.. తగ్గిన చికెన్ సప్లయ్**

**బ్రాయిలర్ రైతుల ముందు జాగ్రత్త**



తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం వచ్చిందంటే చికెన్ ధరలు అమాంతం పడిపోతాయి. ప్రతి సంవత్సరం కార్తీక మాసం వచ్చిందంటే చికెన్ ధరలు అమాంతం పడిపోయి బ్రాయిలర్ రైతులు ఇబ్బంది పడేవారు. మళ్లీ జనవరి నాటికి కాని కోలుకోలేని పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుతం రైతులు కోళ్ల పెంపకం విషయంలో కొంత స్ట్రాటజీ పాటిస్తుండటం వల్ల చికెన్ ధరలు నిలకడగా ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో కేజీ చికెన్ రూ.150కి పడిపోయేది. కానీ ప్రస్తుతం బ్రాయిలర్ లైవ్ రూ.150 పలుకుతుండగా మాంసం స్కిన్‌తో రూ.220, స్కిన్‌లెస్ రూ.240 విక్రయిస్తున్నారు. రానున్న రోజుల్లో ఇదే ధరలు ఉండే పరిస్థితి ఉందని అవసరమైతే ధరలు పెరిగినా ఆశ్చర్యపోనవసరం లేదని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో సాధారణ రోజుల్లో రోజుకు రెండు టన్నుల వరకూ చికెన్ అవసరమవుతుంటుంది. అదే ఆదివారం అయితే ఆ డిమాండ్ 4 టన్నుల వరకు అవసరమవుతుంది. అదే కార్తీక మాసంలో దాదాపుగా మూడు టన్నులు వరకే డిమాండ్ ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కార్తీక మాసం దృష్టిలో పెట్టుకుని బాయిలర్ రైతులు కూడా బ్రాయిలర్ పిల్లల సంఖ్య తగ్గించడంతో డిమాండ్‌కు తగ్గట్టే కోళ్ల లభ్యత ఉంటుంది. దీంతో ధరల్లో పెద్దగా మార్పు ఉండదని బావిస్తున్నారు,



కొత్తగా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారిని సత్కరిస్తున్న మంత్రి

## ఆదర్శ సమాజానికి ఉపాధ్యాయుల పాత్ర కీలకం

పాలకొల్లు టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆదర్శ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు నియోజకవర్గ స్థాయిలో ధర్మారావు ఫౌండేషన్ ద్వారా ఉచితంగా డీఎస్సీ శిక్షణ పొంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన 40 మందిని, అవనిగడ్డ ప్రగతి కోచింగ్ సెంటర్ నిర్వాహకులు పూర్ణచంద్ర రావును మంత్రి డాక్టర్ నిమ్మల ఘనంగా సత్కరించారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ తన జీవితంలో ఇంత మంచి రోజును మరువలేనన్నారు. తన తండ్రి ధార్మారావు పేరుతో ఏర్పాటు చేసిన ధర్మారావు ఫౌండేషన్ ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందజేసిన వారిలో 40 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడం గర్వకారణమని మంత్రి నిమ్మల తెలిపారు. ఈ మహాయజ్ఞంలో విజయవంతం కావడానికి కృషి చేసిన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు, ఉద్యోగాలు సాధించిన వారికి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారిని, వారి కుటుంబ సభ్యులను మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఘనంగా సత్కరించారు. చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నసమయంలో సుమారు 2లక్షల మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రవేశ పెడుతున్న సంస్కరణలతో విద్యావ్యవస్థ రూపురేఖలు మారనున్నాయని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. నియోజక వర్గంలోని డిఎస్సీ అభ్యర్థులు 600 మందికి 130 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరిగిందని, వారిలో 40 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో వీరాస్వామి, ప్రిన్సిపాల్ డిఎన్ఆర్, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, కర్నేన గౌరునాయుడు, తులా రామలింగం, కెకె ప్రసాద్, జిఎస్ఎన్‌రాజు, ఎం పెద్దిరాజు, పాముల రజనీ కుమార్, బోనంనాని, మహ్మద్ జానీ పాల్గొన్నారు.

## ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న హబీబ్ బాషా

టి.నర్సాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధి కారి హబీబ్ బాషా హెచ్చరిం చారు. స్థానిక వెంకటేశ్వర ఎరు వుల దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేసి ఎరువుల నిల్వలను స్టాక్‌రిజి స్టర్‌లో నమోదు చేయాలని సూచి ంచారు. అనంతరం గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులతో ఈ-పంట నమోదు పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూరుశాతం ఈ-పంట నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఏ సుబ్బారావు, గ్రామవ్యవసాయ, ఉద్యానవన సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మోటార్ సైక్లిస్టు మృతి



దుర్గా ప్రసాద్ మృతదేహం

మొగల్తూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):వేగంగా బైక్ నడుపుతూ చెట్టును ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలవ్వడంతో ఆసుపత్రికి తరలించారు. ఆదివారం సాయంత్రం పేరుపాలెం బీచ్ రోడ్డులో జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన మల్లుల దుర్గా ప్రసాద్ (23) కుడుపూడి సాయికృష్ణ, కవురు ప్రవీణ్‌లు బీచ్‌కు వెళ్ళి తిరిగి బైక్‌పై వస్తుండగా అదుపు తప్పి మార్గమధ్యలో కొబ్బరి చెట్టును ఢీకొట్టడంతో దుర్గా ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రవీణ్‌కు తీవ్రగాయాలపాలవ్వడంతో పాలకొల్లు ఆసుపత్రికి తరలించినట్టు తెలిసింది. ఈసంఘటనలో మృతి చెందిన దుర్గా ప్రసాద్‌ను నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మొగల్తూరు ఎస్ఐ వై.నాగలక్ష్మీ తెలిపారు.

## లారీ ఢీకొని బాలుడి మృతి

ఆకివీడు రూరల్ అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గుమ్ములూరు గ్రామంలో లారీ ఢీకొని బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన మల్లాడి మౌనిష్‌శ్రీసాయి(10) ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఇంటి వద్ద నుంచి ట్యూషన్‌కు సైకిల్‌మీద వెళుతుండగా ఆకివీడు నుంచి చినకాపవరం వైపు వెళుతున్న లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో అతను అక్కడిక్కక్కడే మృతి చెందాడు. బాలుడు ఆకివీడులోని ఒక ప్రైవేటు స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. మల్లాడి వీరన్న, జ్యోతిల ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో ఆప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కొద్దిసేపు ఆకివీడు-గణపవరం రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ఏఎస్ఐ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.









ఏఈ నరసింహారావు సేకరించిన పురాతన కాయిన్స్, స్టాంపులు, అగ్గిపెట్టెలు

# సరికొత్తగా..

• ఓల్డ్ ఈజ్ గ్రేట్

**పురాతన వస్తువులంటే ఎంతో ఇష్టం : భీమనాథం వెంకట నరసింహారావు**

**వృత్తి హౌసింగ్ ఏఈ... ప్రవృత్తి నాణేలు, స్టాంపులు, అగ్గిపెట్టెల సేకరణ**



ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి రామానాయుడు, తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ, కలెక్టర్ నాగరాణి (ఫైల్)



పాలకోడేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యక్తిలో ఓ నైపుణ్యత దాగి ఉంటుంది. దానిని వెలికితీసుకువచ్చిన వారే విజయం సాధిస్తారు. ఆ కోవలోకే వస్తారు పాలకోడేరు మండలంలోని హౌసింగ్ ఏఈగా పని చేస్తున్న భీమనాథం వెంకట నరసింహారావు. ఆయన స్వగ్రామం భీమవరం. ఉద్యోగ రీత్యా భీమవరం, ఏలూరు, కృష్ణా జిల్లా, నెల్లూరు జిల్లాలతోపాటు తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో హౌసింగ్ ఏఈగా పని చేశారు. ఆయన వృత్తిలో ఎంత నిబద్ధతతో పనిచేస్తారో అదే నిబద్ధతతో స్టాంపులు సేకరణ, పురాతన నాణేల సేకరణ, పురాతన స్టాంపులు సేకరణ అంటే ఎంతో ఇష్టం. చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టం. ఆ రోజుల్లో ఇంటి పక్కనే నివసిస్తున్న బ్యాంకు ఉద్యోగి గృహంలో మ్యాగజైన్లు చదువుతూ వాటిలో వచ్చిన క్రికెట్ క్రీడాకారుల ఫొటోలు చిన్నప్పటి నుంచి కట్ చేసి దాచుకోవడం అలవాటుగా మారింది. ఈ అలవాటు కాస్తా 1977 సంవత్సరంలో ఏడో తరగతి చదువుతుండగా క్రికెట్ క్రీడాకారులతో పాటు అగ్గిపెట్టెలను సేకరించడం కూడా మొదలుపెట్టారు. ఇదే కాకుండా అణా కాయిన్ నుంచి ప్రస్తుతం వెయ్యి రూపాయల కాయిన్ వరకు నాణేల సేకరించడాన్ని అలవాటుగా మార్చుకున్నారు. మన దేశానికి చెందిన పురాతన నాణేలనే కాకుండా 106 దేశాలకు చెందిన పలు రకాల నాణేలను సేకరించారు. 60 దేశాలకు చెందిన స్టాంపులను సైతం జాగ్రత్త చేశారు. పూర్వకాలంలో లభించే పలు రకాల అగ్గిపెట్టెలను సైతం ఎంతో భద్రంగా దాచి పెడుతూ భవిష్యత్ తరాల వారికి అప్పట్లో వాడుకలో ఉండే వాటిని తెలియపరిచే విధంగా సేకరించారు. పెద్ద పెద్ద కార్యక్రమాలు జరిగేటప్పుడు, రిపబ్లిక్ డే సమయాల్లో, ఎగ్జిబిషన్ సమయాల్లో ఎక్కువ మంది ప్రజలు వచ్చే ప్రాంతంలో ఒక టెంట్ వేయించుకుని వీటి ప్రాముఖ్యతను తెలిపే విధంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. క్రికెట్ మీద మక్కువతో 1983లో వరల్డ్ కప్ గెలిచిన క్రికెట్ క్రీడాకారుల సంతకాలతో ఉన్న బ్యాట్‌ను సైతం ఆయన నేటి వరకు భద్రపరుస్తూ వచ్చారు.

పని చేసేది హౌసింగ్ ఏఈ అయినప్పటికీ ఈయన భవిష్యత్ తరాలకు నాణేలు, కరెన్సీ, స్టాంపులు, అగ్గిపెట్టెలు భద్రపరచి శభాశ్ అనిపించుకుంటున్నారు.

**అవార్డులు, రివార్డుల కోసం కాదు..**



రివార్డులు, అవార్డులు సాధించడానికి ఈ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడం లేదు. చిన్నప్పటి నుంచి పురాతన వస్తువులు సేకరించడం హాబీగా మారింది. ఆ ఇష్టంతోనే 106 దేశాలకు చెందిన నాణేలు, కరెన్సీ నోట్లు, స్టాంపులు, అగ్గిపెట్టెలు సేకరించా. ఎంతో సంతృప్తినిచ్చింది. కలెక్టర్, మంత్రులు, ఆర్డీవో, ఎమ్మెల్యేలు.. ఇలా చాలా మంది అభినందించడం మరింత బలాన్నిచ్చింది.

- భీమనాథం వెంకట నరసింహారావు, పాలకోడేరు హౌసింగ్ ఏఈ

## బాస్కెట్ బాల్ జిల్లా మహిళా జట్టు ఎంపిక



ఏలూరు రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మహిళల జట్టు ఎంపిక పోటీలను ఆదివారం స్థానిక కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 60 మంది మహిళలు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు అధ్యక్ష, కార్యదర్శులు కె. కృష్ణారావు, గవ్వ శ్రీనివాస్‌రావు తెలిపారు. బి. లీలావతి, బి. భవానిదేవి, ఎ. టాలీ అనిత, జి నాగదేవి, టి. జ్యోతి, పి. నాగ వినయశ్రీ, పి. ప్రవల్లిక, పి. జయశ్రీ, ఆర్. మహతి, వి. నిఖిలా రెడ్డి, ఎం. నీరజ, లాస్య, డి. సాయి భవాని, పి. నందిని, ఎ. పూర్ణ చంద్రిక, వి. యామిని ఎంపికయ్యారు. వీరు నవంబరు 7 నుంచి 10 వరకు విశాఖలో జరగబోయే 7వ ఏపీ అంతర్ జిల్లాల సీనియర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని కోచ్ మురళీకృష్ణ తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్స్ కె మాధవిలత, సాంబశివరావు, సురేష్, సీనియర్ ప్లేయర్స్ నగేష్‌రెడ్డి, సుధాకర్, వెలగ సత్యం పర్యవేక్షించారు.

## గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

**తుఫాను హెచ్చరికల నేపథ్యంలో నేటి నుంచి 29 వరకు ఆలయం మూత**

బుట్టాయగూడెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీ మన్యం అటవీ ప్రాంతంలో వేంచేసి ఉన్న అడవి బిడ్డల ఆరాధ్య దైవం గుబ్బల మంగమ్మను ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకు అమ్మవారి ఆలయాన్ని మూసివేస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.





శ్రీవారి క్షేత్రంలో మారేడు వృక్షం.. (పక్కన) ఏకబిల్వ పత్రం

# ఏకబిల్వం శివార్పణం..



**మహేశ్వర ప్రీతిపాత్రం... బిల్వపత్రం**

**శేషాచలంపై బిల్వ వృక్షాలు**

ద్వారకాతిరుమల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పరమేశ్వరుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసంలో రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు చేస్తూ భక్తులు ఆ దేవదేవుని అనుగ్రహం కోసం పరితపిస్తారు. బిల్వ దళాన్ని త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ప్రతిరూపంగా బావిస్తారు.

**అఖండ బిల్వపత్రం చ ఆయుతం శివపూజనం..**
**కృతం నామ సహస్రేణ.... ఏకబిల్వం శివార్పణం**

అంటూ ఆ మహాదేవుని పూజిస్తారు. ఈ త్రిదళ బిల్వ పత్రంలో కుడివైపు విష్ణువు, ఎడమవైపు బ్రహ్మ, మధ్యలో శివుడు కొలువై ఉంటాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ త్రిబిల్వం మహాదేవుని త్రినేత్రాలను, లేదా ఆయన ఆయుధం త్రిశూలాన్ని సూచిస్తాయని కూడా అంటారు. ఈ బిల్వపత్రాలు చాలా రకాలున్నాయి. ఏకబిల్వం, త్రిబిల్వం, సప్తబిల్వం, షణ్ముఖ బిల్వం. పంచముఖ బిల్వం, అఖండ బిల్వం. మారేడుకు శివప్రియ అనే మరోపేరు ఉంది.. బిల్వపత్రాన్ని తెలుగులో మారేడుగా పిలుస్తారు. శివుడు ఈ మారేడు చెట్టుకింద నివాసం ఉంటాడని పండితులు చెబుతున్నారు. పరమేశ్వరుని సోదరి అయిన మహాలక్ష్మి హృదయం నుంచి మారేడు దళాలు ఆవిర్భవించాయని అందుకే ఆ దళం శివయ్యకు అత్యంత ప్రీతిపాత్రమని చెబుతారు. బిల్వ వృక్షాల విశిష్టతను దృష్టిలో ఉంచుకుని ద్వారకా తిరుమల శ్రీవారి శేషాచలకొండపై వీటిని ఎంతో శ్రద్ధగా పెంచుతున్నారు. ముఖ్యంగా క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయ ఆవరణలో ఏకబిల్వం, మహాబిల్వం మొక్కలను నాటి పోషిస్తున్నారు. అరుదుగా లభించే మహాబిల్వం మొక్కను ప్రత్యేకంగా అరుణాచల ప్రదేశ్ నుంచి తెచ్చి నాటారు. క్షేత్రంలో ఈ బిల్వవృక్షాలకు కొదవలేదు. బిల్వ పత్రాలతో తనను పూజిస్తే శనీశ్వరుని బాధ ఉండదని శివుడే తన భక్తులకు అభయమిచ్చాడట. లక్ష్మీదేవి తపోఫలితంగా బిల్వవృక్షం పుట్టిందని అందుకే ఆమెను బిల్వ నిలయా అని పిలుస్తారు. శ్రీ అంటే బిల్వమని, మారేడు చెట్లు విస్తారంగా ఉండటం వల్లే శ్రీశైలం అనే పేరు వచ్చినట్లు చెబుతారు. బిల్వపత్రాల్లో ఎన్నో ఔషధ గుణాలున్నాయట. ఇంటి ఆవరణలోనూ మారేడును నిరభ్యంతరంగా పెంచుకోవచ్చునని పండితులు చెబుతారు.





అరుణాచలం నుంచి తెచ్చిన అరుదైన మహాబిల్వం మొక్క.. (పక్కన)మహాబిల్వ పత్రం

## పచ్చని కాపురంలో చిచ్చు

» వేరే వ్యక్తితో భార్య వివాహేతర సంబంధం

» విషం తాగిన భార్య, భర్తలు.. పరిస్థితి విషమం

భీమడోలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అక్రమ సంబంధం పచ్చని కాపురంలో నిప్పుపెట్టింది. భార్యా భర్తల మధ్య కలతలు రావడంతో సూసైడ్ నోటు రాసి విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన భీమడోలులో జరిగింది. భీమడోలు గ్రామానికి చెందిన గుండమోలు సుధాకర్, భాను పూర్ణిమ ఐదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి మూడేళ్ల బాబు కూడా ఉన్నాడు. వీరి కాపురం సాఫీగా సాగిపోతున్న సమయంలో ఐదు నెలల క్రితం భార్య భాను పూర్ణిమకు భీమడోలు గ్రామానికి చెందిన కఠారి మోహన్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో 6వ తేదీన భాను పూర్ణిమ, మోహన్‌తో కలిసి వేరే ప్రాంతానికి వెళ్లిపోయింది.. మళ్లీ 19న వీరిద్దరూ తిరిగి వచ్చారు. దీంతో పోలీసులు భర్త సుధార్‌తో పాటు వారిద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం భాను పూర్ణిమ పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో అవమానభారంతో భర్త, తప్పు చేశాననే బాధతో భార్య ఇద్దరూ మనస్థాపం చెంది 25వ తేదీన విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వీరిని గుంటూరు తరలించారు. దీనిపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మాయ చేసి తీసుకెళ్లాడు: భాను పూర్ణిమ**

కఠారి మోహన్ అనే వ్యక్తి తనను మాయ చేసి తీసుకెళ్లాడని సూసైడ్ నోట్‌లో పేర్కొంది. మోహన్ అనే వ్యక్తికి అమ్మవారి పూనకం వస్తుందని పలుమార్లు తనకు ఏదో కలిపిన కుంకుమ ఇచ్చి మాయ చేశాడంటూ భాను పూర్ణిమ పేర్కొంది. ఈ కేసుపై భీమడోలు పోలీసులు తమను పట్టించుకోలేదని న్యాయం చేయాలంటూ ఆరోపించింది.

## ఏలూరులో గంగానమ్మ జాతర ప్రారంభం

» మూడు నెలల పాటు శుభకార్యాలకు ప్రజలు దూరం

ఏలూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఏలూరులో గంగానమ్మ జాతర మహోత్సవంగా ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఏడేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతరను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఆయన సతీమణి మీనాకుమారి, మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతుల ఆధ్వర్యంలో పడమర వీధి వేదికగా జరిగే ఈ జాతరకు వంగాయగూడెం వినుకొండ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ముడుపు కట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పందిరి రాట వేశారు. నవంబరు 5వ తేదీ నుంచి అమ్మవార్లకు స్నానాలు ఆచరింపు చేసి ఘట ఆవాహనం చేస్తారు. ఆదివారం మొదలుకుని ఫిబ్రవరి రెండో తేదీ వరకు మూడు నెలల పాటు ఏలూరు కేంద్రంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలేమీ చేయరు. జాతర సమయంలో పొలిమేర కూడా దాటకూడదని చెబుతుంటారు. జాతర జరిగే సమయంలో ప్రజలు ఏ ఆలయంలోను మొక్కులు తీర్చుకోరు. తిరుపతి, అన్నవరం వంటి క్షేత్రాల్లోనూ మొక్కులున్నా జాతర తర్వాతే చెల్లించుకుంటారు. 1995 నుంచి ఈ జాతర సంప్రదాయం కొనసాగుతోంది. తొలుత 12 ఏళ్లకు మధ్యలో 11 ఏళ్లు, 2004 నుంచి ఏడేళ్లకు ఒకసారి ఈ జాతర చేయడం ఆనవాయితీగా వస్తోంది. ముగింపు రోజు దూరపు బంధువులను ఇంటికి ఆహ్వానించి పిండి వంటలు, నాన్‌వెజ్ వడ్డిస్తారు. తాహతు ఉన్నవారు నూతన వస్త్రాలు ఇంటిళ్లపాది పెడుతుంటారు. ఒకప్పుడు ఊరంతా కలిసి జాతరను నిర్వహించేవారు.. ఇప్పుడు తూర్పు వీధి, దక్షిణపు వీధి, పవర్ పేట, ఆదివారపుపేటలోనూ ఈ జాతరను విడివిడిగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



ముడుపు తీసుకువెళ్తున్న ఏలూరు ఎమ్మెల్యే చంటి

# మార్కెట్‌లోకి నాఫెడ్ ఉల్లి

**మహారాష్ట్ర నుంచి 90 టన్నుల రాక**

**క్వింటా రూ.1000 నుంచి 1500**





మార్కెట్‌లో ఉన్న ఉల్లిపాయలు, కూరగాయలు

తాడేపల్లిగూడెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్)నుంచి ఉల్లి వచ్చింది. భారత దేశంలో వ్యవసాయ ఉత్పత్తు మార్కెంటింగ్ సహకార సంస్థల అత్యున్నత సంస్థ ఈ నాఫెడ్. ఈ సంస్థ ద్వారా మార్కెట్‌కు ఉల్లిని సరఫరా చేస్తున్నారు. ఇప్పుడు మార్కెట్లోకి ఈ సంస్థ సరఫరా చేసే ఉల్లి వచ్చింది. ఇది మహారాష్ట్ర నుంచి వచ్చింది. ఆదివారం మార్కెట్లోకి మూడు లారీలో 90 టన్నులు వచ్చింది. దీని ధర క్వింటా రూ.1000 నుంచి 1500 మధ్య ఉంది. సాధారణంగా దీపావళి పురస్కరించుకుని మహారాష్ట్రలో నాలుగు రోజుల పాటు సెలవులు ఉంటాయి. ఈ సమయంలో అక్కడ ఉండే వ్యాపారులు ఉల్లి వ్యాపారం చేయరు. దీంతో ఇప్పుడు మార్కెట్ కొరతను నివారించేందుకు నాఫెడ్ ఉల్లిని మార్కెట్లకు పంపుతుంది.

**కర్నూలు, కడప నుంచి ఆగింది..**

మార్కెట్లో కడప, కర్నూలు రకం ఉల్లి రావడం ఆగింది. ఈ ఏడాది కడప, కర్నూలు ప్రాంతాల్లో ఉల్లి సాగును విస్తారంగా వేశారు. అకాల వర్షాలతో అక్కడ ఉల్లి దెబ్బతింది. దీంతో ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.1200కు కొనుగోలు చేసి ఆదుకుంది. ప్రభుత్వం కొనుగోలు చేసిన ఈ ఉల్లిని హాస్టళ్లకు, చౌకడిపోల్లోను, రైతు బజారులోను అమ్మించారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసి ఇతర మార్కెట్లకు తరలించే సందర్భంలో ఉల్లి దెబ్బతినడంతో టన్నులకొద్ది ఉల్లిని పారబోశారు. ఈ సంవత్సరం ఉల్లి సాగు చేసిన రైతుల కంట కన్నీరు మిగిలింది. గత సంవత్సరం కర్నూలు, కడపలో సాగు చేసిన ఉల్లి తాడేపల్లిగూడెం మార్కెట్లో క్వింటా రూ.4500నుంచి 6000 మధ్య ధర పలికింది. దీంతో కడప, కర్నూలు ప్రాంతాల్లో ఉల్లిని గణనీయంగా సాగు చేశారు. దీంతో ఉల్లి దిగుబడి పెరిగి ధర పడిపోయింది.కొంత మంది రైతులు ఉల్లి సాగు ఖర్చులు కూడా రావడం లేదని పొలాల్లో పశువులను మేపారు. ఇలాంటి గడ్డు పరిస్థితి గతంలో ఎన్నడూ రాలేదు.

**మండుతున్న కూరగాయల ధరలు..**

మార్కెట్లో ఇప్పుడు కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కార్తీక మాసం మొదలు కావడంతో దీని ప్రభావంతో కూరగాయల ధరలు పెరగడం ఒక కారణమైతే.. వాతావరణంలో వచ్చిన మార్పుతో కూరగాయల దిగుబడి తగ్గి ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. కిలో రూ.20 కూడా పలకని బెండకాయలు ఏకంగా రూ.50 చేరాయి. దొండకాయలు రూ.50, క్యారెట్ గత వారం కిలో రూ.50 ఉంటే ఈవారం రూ.70, బీట్ ధర గత వారం కిలో రూ.50 ఉంటే ఈ వారం రూ.80లకు పెరిగింది. బీరకాయలు రూ.50, కాకర రూ.60, బంగాళా దుంపలు రూ.40, వంకాయలు రూ.80, టమాటా రూ.40, చిక్కుళ్లు రూ.120, పచ్చిమిర్చి రూ.50 విక్రయించారు. రిటైల్‌గా ఉల్లి రూ.100లకు 4కేజీలు, 5కేజీలు వంతున అమ్మారు. కడప, కర్నూలు రకాలను మహారాష్ట్ర రకంతో కలిపి ఆటోల్లో రూ.100కు 5 కిలోలు, 6కిలోలు వంతున విక్రయించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భారతి

## భక్తురాలికి పాము కాటు

**ఏలూరు ఆసుపత్రికి తరలింపు**

ద్వారకాతిరుమల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అన్నదానానికి వెళ్లి భోజనం చేసి నడిచి వస్తున్న ఓ భక్తురాలి చేతిపై ఆదివారం రాత్రి కట్ల పాము కాటు వేసింది. దీంతో ఆమె తీవ్ర భయాందోళనలకు గురికావడంతో స్థానికులు ఆమెను ముందుగా పీహెచ్‌సీకి అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చాట్రాయి మండలం చిన్నంపేటకు చెందిన అన్నపురెడ్డి భారతి ఆదివారం మరో కొందరు భక్తులతో కలిసి ద్వారకాతిరుమల వచ్చిస్వామి, అమ్మవార్ల దర్శనానంతరం రాత్రి అన్నదాన సదనంలో భోజనం చేసింది. అనంతరం పాత కేశఖండనశాల వద్ద ఉన్న మెట్ల మార్గం గుండా వస్తోంది. మెట్లు దిగుతూ అక్కడున్న గట్టుపై చేయి వేసింది. గట్టుపై ఉన్న కట్ల పాము భారతి చేతిపై కాటు వేసింది. పీహెచ్‌సీలో వాక్సిన్ వేయించుకున్న అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆమెను ఏలూరు తరలించారు.

# నేడు సొసైటీ ఉద్యోగుల ఆందోళన



జిల్లాలో ఉన్న డీసీసీబీ కార్యాలయం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో పని చేస్తున్న సొసైటీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలపై సోమవారం పోరుబాట చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాలో 1400 మంది ఉద్యోగులు మూకుమ్మడి సెలవులు పెట్టి.. కార్యాలయాలను బంద్ పాటించనున్నారు. విజయవాడలో ఆప్కాబ్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొంటారు. ప్రధానంగా 2019 నుంచి పెండింగ్‌లో పీఆర్‌సీ ఇవ్వాలని వేతనాలు పెంచాలని, పాత బకాయిలు ఇవ్వాలని, ఇతరశాఖల ఉద్యోగుల మాదిరిగా 62 ఏళ్ల వయో పరిమితి అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్లతో ఆందోళనకు ఉప క్రమిస్తున్నారు. తమకు విధిగా చాలా కాలం నుంచి సర్వీసు రూల్స్ అమలు చేయడం లేదని, సొసైటీల నిర్వహణతోనే డీసీసీబీ నిర్వహణ జరుగుతున్నా తమకు పదోన్నతుల కల్పనలో పట్టించుకోవడం లేదని వారు చాలా కాలం నుంచి డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతున్నారు. వాస్తవంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో ఖాళీ ఏర్పడిన చోట్ల 25 శాతం సొసైటీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాల్సి ఉంది. అది కూడా సక్రమంగా జరగడం లేదని యూనియన్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సహకార సంఘాల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**భారం పెంపుపైన ఆందోళన..**

ఇదిలా ఉండగా 2019 నుంచి విధుల్లో చేరిన వార్ని రెగ్యులరైజ్ చేయలేదు. ఉమ్మడి జిల్లాలో 150 పైగా ఈ తరహా ఉద్యోగులు ఉంటారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న సమయంలోను సొసైటీ ఉద్యోగులే కొనుగోలు కేంద్రాలకు కంప్యూటర్లు సమకూర్చడంతో పాటు అక్కడ సిబ్బంది ఇవ్వాల్సి ఉంది. ధాన్యం పట్టుబడి గోనే సంచులను కూడా అందివ్వడం లేదని చెబుతున్నారు. దీంతో రోజూవారి సొసైటీల నిర్వహణ కుంటుపడుతోందని వారు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు సొసైటీల కంప్యూటరీకరణ చేసిన ఇంకా ఆయా సొసైటీల ఉద్యోగులకు పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వనేలేదు. దీంతో పని భారం పెరిగిందని వారు ఆందోళన చెందుతున్నారు. త్రిసభ్య కమిటీ ఛైర్మన్లు ధర్నాలో పాల్గొననున్నట్లు ముందస్తు సమాచారంతో సొసైటీ ఉద్యోగులు సైతం ఆందోళనకు ఉపక్రమిస్తున్నారు.

## యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేప థ్యంలో ఒక యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ మారుతీనగర్‌కు చెందిన సుందరమితి దుర్గారావు(35)కు భార్య, పిల్లలు ఉన్నారు. అతని తల్లిదండ్రుల ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఆ ఇంటిపై అప్పు ఉండడంతో కుటుంబం మధ్య కలహాలు ప్రారంభమయ్యాయి. దీంతో దుర్గారావు భార్య తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్థాపానికి చెందిన దుర్గారావు ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ బి నాగ బాబు సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి ఆదివారం తరలించారు.

## వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని పేరంపేట, పంగిడిగూడెం గ్రామాల్లో నేలవాలిన వరి పంటలను పరిశీలించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం పంట నష్టాలను నమోదు చేసి రైతులందరికీ నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## రాజీలేని పోరాటం కొనసాగించాలి

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో ఉన్న వేల కోట్ల రూపాయల ప్రజల ఆస్తిని, ఏజెంట్ల కష్టాన్ని ఆదానీకి కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వ దివాలాకోరు ఆర్థిక విధానాలపై రాజీలేని పోరాటం కొనసాగించాలని ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం సీతారామ భర్తియా కల్యాణ మండపంలో ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆరవ రాష్ట్ర మహాసభను నిర్వహించారు. ఎల్ఐసీ రాష్ట్ర అధ్యక్షులు టి.కోటేశ్వరరావు సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు.

## వంగూరులో నేత్ర సంరక్షణ కేంద్రం ప్రారంభం

పెదవేగి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో పేదల కోసమే నేత్ర సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశామని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావు అన్నారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం వంగూరు శివారు లక్ష్మీపురంలో విశ్రాంత ఐఏఎస్ అధికారులు కె.దమయంతి, కె.రాజు, గ్రామానికి చెందిన కాసరనేని విద్యా సాగర్‌లు ఇచ్చిన విరాళాలతో కాసరనేని గోపాల కృష్ణయ్య క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన నేత్ర సంరక్షణ కేంద్రాన్ని డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వంగూరు శివారు లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన ఈ నేత్ర సంరక్షణ కేంద్రంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు వైద్యసేవలు వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రాథమిక విజన్ సెంటర్ రోగులను పరిశీలించి వైద్యం అవసరమైన వారిని రిఫరల్ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సుజాతారావు, విశ్రాంత ఐపీఎస్ అధికారి అరుణ, డాక్టర్ జీఎన్.రావు, జి.ప్రతిభారావు, డాక్టర్ రాజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

బుట్టాయగూడెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలని దొరమామిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల హెచ్ఎం పి.బెన్హర్ అన్నారు. మేర యువ భారత్ వారి సహకారంతో మమత సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించగా పోటీలను బెన్హర్ ప్రారంభించారు. మమత సర్వీస్ ఆర్గనైజర్ కె.రాణి, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఉద్యోగులు జి.సోమరాజు, కె.హనుమాన్‌బాబు, కె.సూరిబాబు, బి.వి.రాజు పాల్గొన్నారు.

## పెరుగుతున్న మానవత సభ్యత్వాలు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండల పరిధిలో 750 మానవత సభ్యత్వాలు నమోదైనట్టు ఆ సంస్థ సెంట్రల్ కమిటీ సభ్యుడు మహంకాళి రంగ ప్రసాద్ తెలిపారు. ఆదివారం మండలంలోని గురవాయిగూడెం గ్రామంలోని మానవత కార్యాలయంలో మండల ఉపాధ్యక్షుడు గంధం గోపాల కృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. మండలంలో మానవత సంస్థ నుంచి ఫ్రీజర్ బాక్సులు అందించే విషయంపై, ఇతర సేవా కార్యక్రమాలపై చర్చించారు. మానవత రీజియన్ చైర్మన్ దల్లి రామాంజనేయరెడ్డి, మండల కార్యదర్శి టి.మధు కుమార్, కోశాధికారి ఇమ్మంది మాధవరావు, సెంట్రల్ కమిటీ కన్వీనర్ త్రిపుర రమేష్, దల్లి కేదారేశ్వరరెడ్డి, తడికమళ్ల గోపాలరావు, ఎలికే సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

## నగరంలో మూడు చోట్ల అమ్మవార్ల జాతర

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పడమర వీధిలోని గంగానమ్మ జాతర ఘనంగా నిర్వహించేందుకు ఆదివారం శ్రీకారం చుట్టారు. వంగాయగూడెంలోని ఆదిమహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయం వద్ద మేళతాళాలు, బాజాభజంత్రీలు, అశేష భక్తుల సమక్షంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి దంపతులు ముడుపు కట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిత్య మంగళస్నానం జరిపి పందిరి రాట వేశారు. ఈ నెల 8న అమ్మవార్లను మేడల్లో ప్రవేశపెడతారు. 24న వినుకొండ అంకమ్మ అమ్మవారి పాదాలను భూమిపై మోపి మూడు పగళ్లు, మూడు రాత్రుళ్ళు సంచారం జరుపుతారు. 27న వినుకొండ అంకమ్మ అమ్మవారిని మేడల్లో ప్రవేశపెడతారు. 2026 జనవరి 8వ తేదీన నల్లమారెమ్మ అమ్మవారిని ప్రవేశపెట్టి అదేరోజున అమ్మవారిని సాగనంపుతారు. 31వ తేదీన కొర్లబండిని ఊరేగించి మేడల వద్దకు తీసుకువస్తారు. ఫిబ్రవరి ఒకటవ తేదీన కుంభం పోసే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అదే జాతర మహోత్సవం. 2వ తేదీన అమ్మవార్లను అంగరంగ వైభవంగా మేళతాళాలు, బాజాభజంత్రీలు, విచిత్రవేష ధారణలు, వసంతోత్సవాలతో పొలిమేర్ల వరకు సాగనంపడంతో జాతర మహోత్సవం ముగుస్తుంది. మరో రెండు చోట్ల జాతర జరగనుంది. ఏలూరు నగరంలోని తూర్పు వీధిలోను కూడా జాతర నిమిత్తం ముహూర్తాలు నిర్ణయించారు. ఈ జాతరలపై భక్తులో భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. వేర్వేరు చోట్ల జాతరలు జరపడంతో సందేహాలు ఉన్నాయి. తూర్పువీధిలో గంగానమ్మ జాతర ఈ నెల 31న పందిరిరాటా వేయనున్నారు. జనవరి 25న జాతర, 26న అమ్మవార్లను సాగనంపడం జరుగుతుంది. పవరుపేటలో నవంబరు 9న పందిరి రాటా వేస్తారు. జనవరి 24న కొర్లబండిలో ఊరేగించి మేడల వద్దకు తీసుకువ స్తారు. 25న అమ్మవార్లను కుంభం పోస్తారు. 26న భారీ ఊరేగింపుతో అమ్మ వార్లను సాగనంపడంతో జాతర ముగుస్తుంది.

## బళ్లారిలో ఎన్టీఆర్ నిత్యాన్నదాన ప్రసాదం పంపిణీ

పెదవేగి, అక్టోబరు 26(ఆంంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బళ్లారిలోని ట్రామా కేర్ హాస్పటల్‌లో ఎన్టీఆర్ అన్న ప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న ప్రసాదాన్ని బుడా చైర్మన్ జె.ఎస్.ఆంజనేయులుతో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ అన్న ప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యం ఎంతోమంది పేదలకు అన్నప్రసాదాలు అందించడం అభినందనీయమన్నారు.

## అధికార యంత్రాంగం అప్రమత్తం

(5వ పేజీ తరువాయి)

కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ నంబర్ 9491041419, టోల్ ఫ్రీ నంబర్ 18002331077 లకు ఫోన్ చేసి ప్రజలు తుపాన్ పరిస్థితి తెలుసుకోవచ్చని, అవసరమైన సహాయం పొందవచ్చన్నారు. ప్రజలకు అవసరమైన సేవలందించేందుకు ప్రతి గ్రామానికి ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను ఆదివారం రాత్రి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. నదులు, వాగుల్లోకి ప్రజలు వెళ్లకుండా చూడాలని, కల్వర్టులు, కాజ్‌వేలు, వాగులకు ప్రజలు దాటకుండా హెచ్చరిక బోర్డులు, సిబ్బందిని నియమించాలన్నారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్ళకుండా అప్రమత్తం చేయాలన్నారు. తీవ్ర గాలులకు విద్యుత్ స్తంభాలు కూలే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు తక్షణ చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా, డివిజన్ స్థాయిల్లో విద్యుత్ సంస్థ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. తుఫాన్ సహాయక కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జనరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. తుఫాను పునరావాస కార్యక్రమాలకు ఎస్‌డీఆర్ఎఫ్ బలగాలు జిల్లాకు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీవోలు అచ్యుత్ అంబరీష్, రమణ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**జిల్లాలో భారీ వర్షాలు :** జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆదివారం మబ్బులతో కూడిన వాతావరణంతో వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో 3.7 మి.మీ. నమోదవగా.. కైకలూరు మండలంలో 41.6 మి.మీ. నమోదైంది. మండవల్లిలో 24.8, కలిదిండిలో 20.2, భీమడోలులో 11.8, కామవరపుకోటలో 2.2, లింగపాలెంలో 2.2, ముదినేపల్లిలో 1.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

### ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మహోహర్ నేడు రాక

ఏలూరుసిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో ముందస్తు ఏర్పాట్లను సమీక్షించేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ఉదయం ఏలూరు రానున్నారు. మంత్రి మనోహర్ ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను సందర్శించి తుఫాను తీవ్రత, జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న ముందస్తు చర్యలను సమీక్షిస్తారు.

## ఎక్కడి బస్సులు అక్కడే గప్‌చుప్

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. శనివారం రాత్రి నుంచి కొన్ని కార్యాలయాల్లో ఆ బస్సులు లేవని చెబితే.. మరికొంత మంది టిక్కెట్లు అయిపోయాయని చెబుతున్నారు. వాస్తవానికి ఆ బస్సులను శనివారం రాత్రి నిలిపివేసినట్లుగా తెలుస్తుంది. ఆదివారం కూడా కొన్ని బస్సులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. రవాణాశాఖ అధికా రులు తనిఖీలు కొనసాగిస్తున్నారనే సమాచారం, కేసులు నమోదు చేస్తారనే ఆలోచనతో ముందుగానే బస్సులను తిప్పకుండా నిలిపివేసినట్లుగా తెలుస్తోంది. కొన్ని బస్సులకు సరైన రికార్డులు లేకపోవడం వల్ల నిలిపివేశారనే ప్రచారం కూడా జరుగుతుంది. ఎక్కడి బస్సులు అక్కడే గప్‌చుప్ అనే ధోరణిలో ప్రైవేటు బస్సుల నిర్వాహకులు కొంత మంది ఈ విధంగా బస్సులు తిప్పకుండా నిలిపివేసినట్లుగా స్పష్టమవుతుంది.

**నిరంతర నిఘా :** ప్రైవేటు ట్రావెల్ బస్సులపై జిల్లా రవాణా శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు కొనసాగిస్తున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకూ 28 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.1.91 లక్షల జరిమానా విధించారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ షేక్ కరీమ్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం ఆర్టీవో ఎస్ఎస్ రంగనాయకులు, ఏలూరు ఆర్టీవో ఎస్‌బి శేఖర్ పర్యవేక్షణలో రవాణాశాఖ అధికారులు జంగారెడ్డిగూడెం, ఏలూరు సమీపంలో కలపర్రు టోల్‌గేటు వద్ద ప్రైవేటు కాంట్రాక్టు క్యారేజీ బస్సులపై ప్రత్యేక తనిఖీలను నిర్వహిం చారు. సరైన ధ్రువపత్రాలు చూపని, అత్యవసర ద్వారం, అగ్నిమాపక పరికరాలు, ప్యాసింజర్ లిస్టులేని, తదితర ఉల్లంఘనలపై కేసులు నమోదు చేశారు. తనిఖీలు నిత్యం ఉంటాయని డీటీసీ కరీమ్ తెలిపారు.



ఏలూరులో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ విజయరాజు





పెదవేగి, టి.నరసాపురం మండలాల్లో సమీక్షిస్తున్న ఉన్నతాధికారులు

# మొంథా అలర్ట్

**● శాఖల వారీగా అధికారులు అప్రమత్తం ● గ్రామ స్థాయి సిబ్బందికి దిశానిర్దేశం**

పెదపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి అనూరాధ మండల, గ్రామ స్థాయి అధికారులకు సూచించారు. పెదపాడు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో తహసీల్దారు కృష్ణజ్యోతి అధ్యక్షతన వీఆర్వోలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆదివారం సమీక్ష నిర్వహించారు.డీపీవో అనురాధ మాట్లాడుతూ మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులతో చర్చించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్.ఐ. కట్టా శారద సతీశ్, ఎంపీడీవో ఇందిరా గాంధీ, డిప్యూటీ ఎంపీడీవో వసంత కుమారి, ఏఈ శంకర్, వెటర్నరీ డాక్టరు సంధ్య పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం/పోలవరం: మొంథా తుఫాన్ పట్ల ప్రజలు, రైతులు అన్నివర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ ట్రైకార్ చైర్మన్, పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు సూచించారు. తుఫాన్ హెచ్చరికలతో కూటమి నాయకులు అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందించాలన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు ముంపు ప్రాంతాల ప్రజలు నివాసాలకే పరిమితమవ్వాలన్నారు.

● ఏలూరు రూరల్: మండలంలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు సూచించారు. ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో తుఫానుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి శారద, ఐసీడీఎస్ పీడీ శారద, తహసీల్దార్ విజయకుమార్, ఎంపీడీవో గొరపాటి రాజేశ్వరి, మండల అధికారులు పాల్గొన్నారు.

● భీమడోలు:తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి నాగరాణి సూచించారు. మండల ప్రత్యేక అధికారి నాగరాణి పాల్గొని అధికారులకు సూచనలిచ్చారు.

● కుక్కునూరు: తుఫాన్ కారణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల ప్రత్యేకాధికారి బుజ్జిబాబు సూచనలు చేశారు. సమావేశంలో తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎస్.ఐ. రాజారెడ్డి, ఏఓ బాలాజీ, విద్యుత్ ఏఈ పాపారావు పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ తుఫాన్ జాగ్రత్తలు సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ సాయిబాబా, ఎంపీడీవో మణి కుమారి, ఎస్సై జయబాబు పాల్గొన్నారు.

● పెదవేగి: తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దెందులూరు నియోజకవర్గం ప్రత్యేకాధికారి విజయరాజు సూచించారు. దెందులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.దెందులూరు మండల ప్రత్యేకాధికారి ఎస్.సత్యనారాయణ, తహసీల్దార్లు బి.సుమతి, ఎస్.డి.భ్రమరాంబ, జి.విజయకుమార్‌రాజు, ఎంపీడీవోలు షరీఫ్, కే.రవికుమార్, నాగరాజకుమారి పాల్గొన్నారు.పెదవేగి మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేకాధికారి, వికలాంగ సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు రామ్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. తహసీల్దారు ఎస్డీ.భ్రమరాంబ, ఎంపీడీవో కె.రవికుమార్, ఎస్ఐ కె.రామకృష్ణ, ఎంఈవో -2 అరుణ్‌కుమార్, ఈవో పీఆర్డీ షరీఫ్, ఏపీవో హేమలత పాల్గొన్నారు. పెదవేగి తహసీల్దార్ ఎస్డీ.భ్రమరాంబ వీఆర్వోలకు పలు సూచనలు చేశారు. ఆర్ఐ కెవీపీ.సారథి పాల్గొన్నారు.

● లింగపాలెం: మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నజీముల్లాషా, ఎంపిడీవో కె.వాణి తెలిపారు. అన్నిశాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అధిక వర్షాలకు గ్రామాల్లో చెరువులు తెగే పరిస్థితులు ఎదురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: మొంథా తుఫాన్ ప్రభావం వల్ల అన్ని శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో ఎం.వి.రమణ ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కె.స్లీవజోజి, మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, సిఐ సుభాష్, ఎస్.ఐ.లు ఎస్.కె.జబీర్, శశాంక పాల్గొన్నారు.

● ఏలూరుసిటీ:మొంథా తుఫాన్ కారణంగా ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు తగు చర్యలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ డిడి షాజా నాయక్ తెలిపారు. కోతకు వచ్చిన కూరగాయలను వెంటనే కోసి మార్కెట్ చేసుకోవాలన్నారు. నిల్వ ఉన్న నీటిని సాధ్యమైనంతవరకు బయటకు పంపాలన్నారు. గెలలు మీద ఉన్న అరటి తోటల్లో వెదురు గెడలతో ఊతం ఇవ్వాలన్నారు.

## విశ్వనాథ ఆశ్రమంలో పూజలు

చింతలపూడి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన విశ్వనాథ ఆశ్రమంలో శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు కాగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న పూజలు ఆదివారంతో ముగిశాయి.పాతబస్టాండ్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి అమ్మవారి పీఠం వద్దకు కలశాలతో ఊరేగించారు. ఆశ్రమ వ్యవస్థాపక కుటుంబాల్లో ఒకరైన బండి విశ్వేశ్వర మూర్తి దంపతులు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

## ఎన్టీఏ జిల్లా శాఖ కార్యవర్గ ఎన్నిక

ఏలూరు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ అనుబంధ ఉపాధ్యాయ సంఘం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏలూరులో ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా టి.మురళి, ప్రధాన కార్యదర్శిగా ఎం.రాంబాబు, ఆర్థిక కార్యదర్శిగా టి.శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా బి.రాములను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్టీఏ క్రమ శిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ సీహెచ్.సుభాష్ చంద్రబోస్, జిల్లా మాజీ అధ్యక్షుడు సీహెచ్.వెంకట రమణారావు, రూజ్‌వెల్ట్ పాల్గొన్నారు.



వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

## ఘనంగా సత్యసాయి వ్రతాలు

కొయ్యలగూడెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):శ్రీసత్యసాయి సేవా సమితి కన్నాయిగూడెంలో ఏర్పడి 60 సంవత్సరాలైన సందర్భంగా సత్యసాయి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 100మంది దంపతులు ఈ వ్రతాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## భక్తులతో కళకళలాడిన శ్రీవారి సన్నిధి

ద్వారకాతిరుమల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వారాంతపు సెలవు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు శ్రీవారి క్షేత్రానికి విచ్చేశారు.ఉదయం నుంచే ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. దీంతో అన్ని విభాగాలు సందడిగా మారాయి. దాదాపు 15 వేల మంది పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి నిత్యార్జిత కల్యాణంలో 128 జంటలు పాల్గొన్నాయి.



రోడ్డు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి, ఎంపీ పుట్టా

## నల్లదిబ్బ రోడ్డుకు మోక్షం

ఏలూరు టూటౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలో అధ్వానంగా తయారైన నల్లదిబ్బ సాయినగర్ రోడ్డును త్వరలో నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి నల్లదిబ్బరోడ్డు ఏరియాను పరిశీలించారు. ఎంపీ మహేశ్ మాట్లాడుతూ రూ.50లక్షల అంచనా వ్యయంతో బీటీరోడ్డు పనులకు ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. త్వరలోనే రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. ఆర్‌టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, ఇడా చైర్మన్ శివప్రసాద్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, అమరావతి అశోక్, బొద్దాని శ్రీనివాస్, కార్పొరేటర్ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిసిటీ యూనియన్ దినోత్సవం

ఏలూరుటూటౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ - 327 ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యుత్‌స్టోర్ వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో డిస్కం అధ్యక్షులు భూక్యా నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, కార్యదర్శి ఏ.నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు, నిర్మల్‌గౌడ్, పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి

కొయ్యలగూడెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవార్ని ఆదుకోవడానికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని మానవత సంస్థ అధ్యక్షుడు మందపాటి రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక తారకరామ నగర్‌లో ఇటీవల అనారోగ్యానికి గురై వైద్యఖర్చుల కోసం ఇబ్బందిపడుతున్న ముప్పిడి విజయ్‌కు సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ సభ్యులు ముప్పానపల్లి వెంకటేశ్వరరావు, నక్కా బాబి, వీఎస్ఎన్ స్వామి, రాము, షేక్ బాషా, చంటి, మోహనరావు పాల్గొన్నారు.

## బస్సు టైరు పేలి ఒకరికి గాయాలు

పెదపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణిస్తుండగా బస్సు టైరు పేలడంతో లోపల ఉన్న వ్యక్తికి రెండు చోట్ల గాయాలైన ఘటనపై పెదపాడు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. కృష్ణా జిల్లా గుడివాడ ప్రాంతానికి చెందిన అమ్మనమంచి జోగేంద్ర సాయికృష్ణ గత 13 సంవత్సరాలుగా ఏలూరులోని ఆంధ్రా ఆసుపత్రిలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా ఈ నెల 21న గుడి వాడ నుంచి ఏలూరుకు ఆర్టీసీ అద్దె బస్సులో బయల్దేరాడు. పెదపాడు మండలం అప్పనవీడు పంచాయతీ తాళ్లమూడి హైస్కూల్ వద్ద బస్సు టైరు పేలి టైరుపై సీటులో కూర్చున్న సాయికృష్ణ ఎడమకాలు రెండు చోట్ల విరిగింది. బాధితుడిని చికిత్స నిమిత్తం నిమిత్తం ఏలూరు ఆంధ్రా ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

## 42 శాతం రిజర్వేషన్లు సాధించాలి

ఏలూరు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బీసీలకు రాజ్యాంగబద్ధ పదవుల్లో 42శాతం రిజర్వేషన్లు దేశవ్యాప్తంగా కల్పించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని అభ్యర్థిస్తూ ఆదివారం హైదరాబాద్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను కలుసుకుని వినతిపత్రాన్ని అందజేసినట్టు డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక మీడియాకు వివరాలు తెలిపారు. జనాభాకు అనుగుణంగా వెనుకబడిన తరగతులకు విద్య, ఉద్యోగాలు, రాజ్యాంగబద్ధ పదవుల్లో న్యాయం జరగడంలేదని, ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా హెచ్చుతగ్గులున్న విషయాన్ని ఎంపీ



కృష్ణయ్యను సత్కరిస్తున్న సంఘ నాయకులు

దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్యను సత్కరించారు. అఖిలభారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడు చిత్తలూరి ప్రసాద్, తెలుగు రాష్ట్రాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు ఇవ్వాలి

ఏలూరు అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) :రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలవారికి 12శాతం ప్రత్యేక రిజర్వేషన్లను కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ను, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను డిమాండ్ చేస్తున్నట్టు కాపు రిజర్వేషన్ పోరాటసమితి రాష్ట్ర నాయకుడు ఆర్.మురళీ శ్రీనివాస్ కోరారు. కాపులపట్ల కూటమిప్రభుత్వం కుల వివక్ష చూపిస్తోందని ఆరోపించారు. కాపులకు జనాభా ప్రాతిపదికన రాజ్యాధికారం స్థానిక సంస్థల నుంచి పార్లమెంటు వరకు ఉండాలని డిమాండ్ చేశారు.

## ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఏలూరు రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ భవనంలో ఆదివారం ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా కె.రమేష్‌కుమార్ వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. ఏలూరు అర్బన్, అసోసియేట్ అధ్యక్షుడిగా జి.విజయ్‌కుమార్‌రాజు, ఉపాధ్యక్షుడిగా కె.చల్లన్న దొర, కె.రవిచంద్రరావు, ఎం.సోమేశ్వరరావు, పి.మాధవి,సెక్రెటరీ ఎ.ప్రమోద్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సి.హెచ్.యశ్వంత్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా బి.సందీప్‌గౌడ్, జాయింట్ సెక్రెటరీ సి.హెచ్.యు.వి.వి.కె.స్వామి, జాయింట్ సెక్రటరీలుగా జె.శ్రీను నాయక్, పి.నసీమాబేగం, ఎం.మల్లికార్జునరావు, ట్రెజరర్‌గా ఆర్.వెంకట రాజేష్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా టి.రాజరత్న కుమార్, కె నరసింహారావు, స్టేట్ కౌన్సిలర్ జీఎన్‌సి శేఖర్‌బాబు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వీరాంజనేయ ప్రసాద్ వ్యవహరించారు.

## పట్టిసీమ శివక్షేత్రానికి భక్తుల తాకిడి

పోలవరం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ఆదివారం సందర్భంగా పట్టిసీమ శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో భక్తులు, అయ్యప్ప, భవానీ దీక్షల భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి, కాలభైరవుడు, నవగ్రహాలు, క్షేత్రపాలకుడు భావన్నారాయణస్వామి, సీతారామచంద్ర స్వామి, సుబ్రమణ్యేశ్వరుడు, భద్రకాళీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కాంగ్రెస్ నాయకుల సంతకాల సేకరణ

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఓట్ చోర్-గద్దీ చోర్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పలు డివిజన్లలో ప్రజల నుంచి సంతకాల సేకరించారు. కాంగ్రెస్ నాయకులు దండుబోయిన చంద్రశేఖరరావు, సుబ్బారావు, కె.ఎస్.ఎన్.మూర్తి, కుమార్, భూషణం పాల్గొన్నారు.

## బౌద్ధారామాల వద్ద నేడు తిరునాళ్లు

కామవరపుకోట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం గుంటుపల్లి పంచాయతీ జీలకర్రగూడెం కొండగట్టుపై ఉన్న బౌద్ధారామాల వద్ద కార్తీకమాసం సోమవారాన్ని పురస్కరించుకుని తీర్థం నిర్వహించనున్నారు. అనాదికాలంగా కార్తీకమాసంలోని సోమవారం బౌద్ధారామాలను, బౌద్ధ గుహలను, చైత్యాలను, పాలరాతి కట్టడాలను, ఏకశిలా నిర్మితమైన ధర్మలింగేశ్వరస్వామి ఆలయాన్ని భక్తులు సందర్శిస్తారు. బౌద్ధారామాలను సందర్శించేందుకు వచ్చే 12 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత ప్రవేశాన్ని కలగచేస్తామని, పెద్దలకు రూ.25, విదేశీయులకు రూ.300 చొప్పున ప్రవేశానికి రుసుం వసూలు చేస్తామని, వీడియో చిత్రీకరణకు రూ.25 చొప్పున టికెట్ ధర నిర్ణయించినట్టు సంబంధిత అధికారి నాగేంద్రకుమార్ తెలిపారు.

## వైద్య భగవానుడికి అభిషేకాలు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలోని తొలి ఆదివారం కావడంతో పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుడి ఆలయం వద్ద భక్తులు సామూహికంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సూర్యనమస్కార పూజలు జరిపారు. ఆలయ ప్రదిక్షణలు నిర్వహించి అర్చకులు రాళ్ళబండి ఆదినారాయణశర్మ ద్వారా రక్షాబంధనాలు కట్టించుకుని వనమాలికల తీర్థాన్ని స్వీకరించారు.

## రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం రాట్నాల కుంట శ్రీరాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మ వారిని దర్శించుకుని, పూజలు జరిపారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకటరామ సత్య నారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్ర నామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. ఆల య కార్యనిర్వహణాధికారి ఎన్.సతీశ్ కుమార్ మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.43,070లు విరాళాలు అందించారన్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ మన్నే శ్రీనివాసరావు తెలిపారు.



## గోతులు సరిచేయించిన ఎస్ఐ

జీలుగుమిల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తాటియాకులగూడెం జాతీయ రహదారిపై గోతులను ఎస్.ఐ. వి.క్రాంతికుమార్ ఆదివారం సరిచేయించారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై గోతులు మరింత పెద్దవిగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పలు చోట్ల రహదారిపై గోతుల్ని ఎస్.ఐ. జేసీబీతో సరిచేయించారు.

## చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలు తరలిస్తుండగా గుడిపాడు సమీపంలో తనిఖీలు చేసి బొలేరో వాహనాన్ని పట్టుకున్నట్టు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. వాహనంతో పాటు చికెన్ వ్యర్థాలు స్వాధీనం చేసుకుని పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.



## చిర్రిని కలిసిన ఎమ్మెల్యే ధర్మరాజు

జీలుగుమిల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే చిర్రి బాలరాజును బర్రింకలపాడు క్యాంపు కార్యాలయం వద్ద ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలపై ఆయా నియోజకవర్గాల్లో జరిపే అభివృద్ధిపై చర్చించుకున్నారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షులు సరిపల్లి సత్యనారాయణరాజు ఉన్నారు.

## సువర్చలా హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది అంజనేయస్వామి క్షేత్రంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల అర్చన, ఉక్త హోమాలు,వేద పారాయణం, హనుమద్ హోమం, శ్రీసువర్చలా హనుమద్ కల్యాణం వేదపండితులు, అర్చకులు, రుత్వికుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు స్వామికి వివిధ సేవల రూపంలో రూ.1,86,577 ఆదాయం సమకూరినట్టు ఈవో ఆర్.వి.చందన తెలిపారు.

## పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కుక్కునూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండల కేంద్రంలో పత్తికొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గిరిజన రైతాంగం డిమాండ్ చేశారు. ఆదివారం కుక్కునూరు పంచాయతీ ఇసుకపాడు గ్రామంలో కిష్టారం, కొర్లగుంట, ఇసుకపాడు, లంకాలపల్లి, వఙ్యంవారిగుంపు, నల్లకుంట గ్రామాలకు చెందిన గిరిజన రైతులు సమావేశమయ్యారు. కుక్కునూరు 2 సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండాలని పత్తిరైతులు నష్టపోకుండా మద్దతు ధరకే పత్తికొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన రైతులు వూకే భద్రయ్య,మడకం చంద్రరావు, శీలం లక్ష్మయ్య, శీలం దుర్గయ్య, జడ్డి భద్రయ్య, మడకం వెంకటేశ్వర్లు, గజ్జి రాజులు పాల్గొన్నారు.

## ఘనంగా వన సమారాధన

కొయ్యలగూడెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డు వద్ద ఆర్యవైశ్య సమారాధన జరిగింది. ఈ సందర్భంగా మండలం నుంచి వివిధ ప్రాంతాల నుంచి ఆర్యవైశ్యులు ఈ వనసమారాధనలో పాల్గొన్నారు. వివిధ రంగాల్లో నైపుణ్యత సాధించిన పలువుర్ని సన్మానించారు. అధ్యక్షుడు మాటూరి సుధీర్, కార్యదర్శి సాయి ఆధ్వర్యంలో నిర్వహించారు.

## స్వాములకు నిత్య భిక్ష

కామవరపుకోట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో సర్వమాలలు వేసుకున్న దీక్షాస్వాములకు నిత్య భిక్ష కార్యక్రమం 20 రోజులుగా ఘనంగా కొనసాగుతుంది. ఈ ప్రక్రియలో భాగంగా ఆదివారం భక్తులకు మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ దంపతులు, ఘంటా సత్యంబాబు దంపతులు అన్నప్రసాదాన్ని భక్తులకు అందచేశారు. అయ్యప్ప, భవాని, గోవింద, శివ తదితర దీక్షలు చేపట్టిన స్వాములు భిక్షలో పాల్గొన్నారు. చిక్కుళ్ళ రమేశ్ పాల్గొన్నారు.

## వరి కోతలు వాయిదా వేసుకోండి : ఏవో

చాట్రాయి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరికోతలను రైతులు వాయిదా వేసుకోవాలని ఏవో శివశంకర్ సూచించారు. రైతులు వరి పొలం గట్ల వెంబడి కాలువలు తవ్వి వర్షం నీటికి బయటకు పంపే ఏర్పాట్లు చెయ్యాలని, కోసిన ధాన్యంపై టార్పాలిన్లు కప్పి తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంట పనలపై తడిస్తే ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేస్తే మొలక రాకుండా ఉంటుందని, మరిన్ని సలహాలు, సూచనల కోసం స్థానిక రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు.



## ముంపు బాధితులను ఆదుకోవాలి

కలిదిండి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ముంపు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పడమటి పాలెం బంకు కాలనీలో ముంపు బాధితులను పరామర్శించారు. ఊరచెరువు పొంగటంతో కాలనీలో ఇళ్ల ముంపు బారిన పడుతున్నాయని చెరువులో నీరు బయటకు తోడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొంతమంది కాలనీ వాసులకు ఇళ్ల స్థలాలు మంజూరైనా నిర్మించుకునే స్థోమత లేక ఇక్కడే నివాసం ఉంటున్నారని వారికి ప్రభుత్వమే ఇళ్ల నిర్మించాలన్నారు.



కలిదిండిలో లాల్వ డ్రెయిన్‌పై వంతెనను పరిశీలిస్తున్న కలెక్టర్

## తాత్కాలిక వంతెన నిర్మాణానికి చర్యలు : కలెక్టర్

కలిదిండి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): లాల్వ డ్రెయిన్‌పై తాత్కాలిక వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఆదివారం కలిదిండిలో లాల్వ డ్రెయిన్‌పై కూలిన వంతెనను పరిశీలించారు. ప్రస్తుతం వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా తాత్కాలిక వంతెన ఏర్పాటుచేసి ఆ తర్వాత శాశ్వత వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రాబోయే మూడు రోజులు ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, ఆర్ఐ శ్యామల, డీసీ చైర్మన్ పేటేటి సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు, సర్పంచ్ ప్రసన్న, ఆర్ అండ్ బి, డ్రైనేజీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పండ్ల తోటల్లో నష్ట నివారణ చర్యలు చేపట్టండి

చాట్రాయి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా అధిక వర్షాలకు పండ్ల తోటల్లో రైతులు నష్ట నివారణ చర్యలు చేపట్టాలని మండల ఉద్యానశాఖ అధికారి ఆర్ హేమ సూచించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ వీలైనంత త్వరగా చేలల్లో అధికంగా ఉన్న వర్షం నీటిని తీసివేయాలని, పంట ఎదుగుదలకు తోడ్పడే విధంగా బూస్టర్ డోస్ ఎరువులు వేయాలని, అధిక తేమ వలన ఉధృతి అయ్యే తుగుళ్ళ పురుగులు నివారణకు సస్య రక్షణ చేపట్టాలన్నారు. వర్షాలు తగ్గగానే వీలైనంత త్వరగా చెట్ల మధ్య దున్నటం వలన తేమ త్వరగా ఆరి చెట్లు కోలుకుంటాయని, అధిక గాలులకు వేళ్ళతో సహా ఒరిగిన చెట్లను నిలబెట్టి మట్టి వేసి ఊతమివ్వాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

**ముందు జాగ్రత్త చర్యలు తీసుకోండి**

**నూజివీడు టౌన్** : అధికవర్షాలు వల్ల పంటలకు నష్టం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, నూజివీడు ఉద్యానవనశాఖ అధికారిణి ఆర్.హేమ తెలిపారు. మామిడితోటలో బారీవర్షాలు అనంతరం వీలైనంత త్వరగా చేలల్లో అధికంగా ఉన్న నీటిని తీసివేయాలని పంట పెరుగుదలకు తోడ్పడే విధంగా బూస్టర్‌డోస్ ఎరువులను అందించాలన్నారు.పురుగుల నివారణకు థైమిథోమిట్ రెండు మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరిపాస్ 2.5 మిల్లీమీటర్లు లీటరు నీటికి కలిపి చెట్టుమొత్తం తడిచేలా పిచికారీ చేయాలన్నారు. అధిక తేమవల్ల తెగుళ్ళ ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మామిడిలో విరిగిన కొమ్మలను కత్తిరించి బోర్డోపేస్ట్ పూయడంతో పాటు చెట్లమధ్య దున్ని అధికతేమను తొలగించాలన్నారు.

## గొరిపర్తి కుటుంబీకులకు మంత్రి పరామర్శ

కలిదిండి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కలిదిండికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ గొరిపర్తి సుబ్బారావు కుటుంబ సభ్యులను రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కృష్ణ యాదవ్, మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ నున్న భగవాన్లు, యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రేటి శ్రీహరి, మాజీ ఎంపీపీ రామారావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఏ.శ్రీనివాస్, కలిదిండి సర్పంచ్ ప్రసన్న పాల్గొన్నారు.

**శస్త్రచికిత్స చేయించుకున్న దేశం నాయకుడికి పరామర్శ**

**చాట్రాయి:** విజయవాడ ప్రైవేటు ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకొన్న సీకే పాడు నీటి సంఘం అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు మంచిన పూర్ణచంద్రరావును ఆదివారం మంత్రి పార్థసారథి ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకొని ప్రజా జీవితంలోకి రావాలని మంత్రి ఆకాంక్షించారు.

## క్రీడలను ప్రోత్సహించాలి : సీఐ రామకృష్ణ

కైకలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కైకలూరు టౌన్ సీఐ ఏవీఎస్ రామకృష్ణ అన్నారు. ఆదివారం కైకలూరు మండలం వేమవరప్పాడు ఆర్సీఎం చర్చి వద్ద లయోలా యూత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో పలు ప్రాంతాల నుంచి కబడ్డీ క్రీడాకారులు పెద్దఎత్తున పాల్గొననున్నారు. లయోల టీంకు టీషర్టులను మాజీ సర్పంచ్ బోయిన శ్రీనివాస్ జ్ఞాపకార్థం అతని సోదరుడు గోవర్ధన అందజేశారు.

## మానవత ఆర్థిక సాయం

మండవల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల మానవత శాఖ ఆధ్వర్యంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు పాలైన చావలిపాడుకు చెందిన షేక్ బాజీ కుటుంబానికి నెలవారి సరుకులు, రూ.10వేలు ఆర్థిక సాయం ఆదివారం అందించారు. మానవత సమాజంలో అసమానతలు తొలగించేం దుకు కృషి చేస్తుందని కెరీర్ గైడెన్స్ సభ్యుడు సుధాబత్తుల విజయ్‌కుమార్ తెలిపారు. మానవత మండల శాఖ అధ్యక్షుడు కూనపురెడ్డి కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

## మార్కెట్‌లోకి నాఫెడ్ ఉల్లి

తాడేపల్లిగూడెం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్)నుంచి ఉల్లి వచ్చింది. దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సహకార సంస్థల అత్యున్నత సంస్థ ఈ నాఫెడ్. ఇప్పుడు మార్కెట్లోకి ఈ సంస్థ సరఫరా చేసే ఉల్లి మహారాష్ట్ర నుంచి వచ్చింది. ఆది వారం మార్కెట్లోకి మూడు లారీలో 90 టన్నులు వచ్చింది. దీని ధర క్వింటా రూ.1000 నుంచి 1500 మధ్య ఉంది. సాధారణంగా దీపావళి పు రస్కరించుకుని మహారాష్ట్రలో నాలుగు రోజుల పాటు సెలవులు ఉంటాయి. ఈ సమయంలో అ క్కడ ఉండే వ్యాపారులు ఉల్లి వ్యాపారం చేయ రు. దీంతో ఇప్పుడు మార్కెట్ కొరతను నివారిం చేందుకు నాఫెడ్ ఉల్లిని మార్కెట్లకు పంపుతుంది.

**కర్నూలు, కడప నుంచి ఆగింది..**

మార్కెట్లో కడప, కర్నూలు రకం ఉల్లి రావ డం ఆగింది. ఈ ఏడాది కడప, కర్నూలు ప్రాం తాల్లో ఉల్లి సాగును విస్తారంగా వేశారు. అకాల వర్షాలతో అక్కడ ఉల్లి దెబ్బతింది. దీంతో ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకునేందుకు మార్క్ ఫెడ్ ద్వారా క్వింటా రూ.1200కు కొనుగోలు చేసి ఆదుకుంది. ప్రభుత్వం కొనుగోలు చేసిన ఈ ఉ ల్లిని హాస్టళ్లకు, చౌకడిపోల్లోను, రైతు బజారు లోను అమ్మించారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసి ఇతర మార్కెట్లకు తరలించే సందర్భంలో ఉల్లి దెబ్బతినడంతో టన్నులకొద్ది ఉల్లిని పారబోశారు. ఈ సంవత్సరం ఉల్లి సాగు చేసిన రైతుల కంట కన్నీరు మిగిలింది. గత సంవత్సరం కర్నూలు, కడపలో సాగు చేసిన ఉల్లి తాడేపల్లిగూడెం మా ర్కెట్లో క్వింటా రూ.4500నుంచి 6000 మధ్య ధర పలికింది. దీంతో కడప, కర్నూలు ప్రాంతాల్లో ఉల్లిని గణనీయంగా సాగు చేశారు. దీంతో ఉల్లి దిగుబడి పెరిగి ధర పడిపోయింది.కొంత మంది రైతులు ఉల్లి సాగు ఖర్చులు కూడా రావడం లేదని పొలాల్లో పశువులను మేపారు. ఇలాంటి గడ్డు పరిస్థితి గతంలో ఎన్నడూ రాలేదు.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 140, 149, 160 |
| చికెన్ విత్ స్కిన్ | 270 |
| చికెన్ స్కిన్‌లెస్ | 280 |
| **నెక్ కోడి గుడ్డు ధర (100)** | |
| విజయవాడ జోన్ రైతు ధర | రూ.475 |



నూజివీడులో అధికారులకు సూచనలిస్తున్న జడ్పీ సీఈవో శ్రీహరి

నూజివీడు టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫానును ఎదుర్కొనేందుకు అధికారులు సంసిద్ధులుగా ఉండాలని ఏలూరు జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి ఆదేశించారు. నూజివీడు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తుఫాన్ ప్రభావం వల్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ సరఫరాలో అవాంతరాల్లేకుండా ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలన్నారు. ఎంపీడీవో చెన్నరాఘవేంద్ర రావు, ఉప మండలాభివృద్ధి అధికారి వై.శివరంగారావు, నూజివీడు మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రాణ, ఆస్తి నష్టం జరగనివ్వద్దు

**ముసునూరు:** మొంథా తుఫాన్‌పై ముసునూరు మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో నూజివీడు డీఎల్‌పీవో సుందరి మండల ప్రత్యేక అధికారులతో ఆదివారం అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. తుఫాన్ వల్ల ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా కలుగకుండా చేపట్టాల్సిన చర్యలపై ఆమె అధికారులతో సమీక్షించి మాట్లాడుతూ మండలంలో చెక్కపల్లి, చింతలవల్లి, కాట్రేనిపాడు, ముసునూరు, కొర్లకుంట గ్రామాల్లో ఈదురుగాలులతోపాటు అత్యధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందన ప్రత్యామ్నాయంగా జనరేటర్లు సిద్ధం చేయాలని, మంచినీటి ట్యాంకులను అందుబాటులో ఉంచి, ఆర్‌వో ప్లాంట్లలో సైతం తాగునీటిని నిల్వ చేసి, పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పల్లపు ప్రాంతాల ప్రజలకు పాఠశాలల్లో పునరావాసం కల్పించి, వారికి అన్ని సౌకర్యాలు కల్పిం చేలా చూడాలన్నారు. ప్రజలకు వైద్యసేవలు అందిం చేందుకు వైద్యులు, సిబ్బంది చర్యలు తీసుకోవాల న్నారు. అత్యవసర సేవలకు 108, 104 వాహనాలను సిద్ధంగా ఉంచాల న్నారు. గ్రామాల్లో ప్రమాదంగా ఉన్న చెట్లను ముందస్తుగా తొలగించాలని, రహదా రులకు అడ్డుగా పడిన చెట్టును వెంటనే తొలగించేలా యంత్రాలను సిద్ధం చేసుకోవా లన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తం గా ఉన్న చెరువులు పూర్తి స్థాయిలో నిండాయని, ముఖ్యంగా జనావాసాలకు దగ్గరగా ఉన్న చెరువులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తుఫాన్ వల్ల ఎటు వంటి ఇబ్బందులు ఉన్నా మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబర్లు 86882 29896, 94929 38116లకు సమాచారం అందించాలని కోరారు. ఎంపీడీవో పిల్లి ఏసుబాబు, ఆర్‌డబ్ల్యూయస్ ఇన్‌చార్జ్ డీఈ కేవీ సత్యప్రసాద్, ఎంఈవో సుబ్బారావు, పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ముసునూరులో అధికారులతో కలసి మాట్లాడుతున్న డీఎల్‌పీవో సుందరి



ఆగిరిపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ విలియమ్స్

# సంసిద్ధంగా ఉండండి

## తుఫాన్ నేపథ్యంలో అధికారులకు ఉన్నతాధికారుల సూచన



లోకుమూడిలో మైక్‌తో పోలీసుల తుఫాన్ హెచ్చరికలు

## సమన్వయంతో పనిచేయండి..

**చాట్రాయి:** మొంథా తుఫాన్ వల్ల ఎటువంటి నష్టం జరగకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ భద్రు, ఎంపీడీవో సత్యనారాయణ కోరారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం అన్ని శాఖల అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచెయ్యాలని ఆదేశించారు. చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామని ప్రజలు ఏదైనా సమాచారం ఉంటే కంట్రోల్ రూంలకు తెలియజేయాలన్నారు. ఎస్‌ఐ రామకృష్ణ, వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, డీటీ ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

**ఆగిరిపల్లి:** అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల స్పెషల్ ఆఫీసరు, జిల్లా పౌర సరఫరాల అధికారి ఈబీ విలియమ్స్ అన్నారు. తుఫాను ప్రభావంపై మండలంలోని అన్నిశాఖల అధికారులతో మండల రెవెన్యూ కార్యాలయంలో ఆదివారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ పరిధిలో ఉన్న ట్యాంకులు, కాలువలు, వాగులు, డ్రైన్లు దిగువ ప్రాంతాలను చెక్ చేసి అవసరమైతే నీటి విడుదల మార్గాలను సిద్ధంగా ఉంచామన్నారు. గ్రామాల్లో ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర మందులు ఏర్పాటు చేశామన్నారు. వృక్షాలు, విద్యుత్తు తీగలపై పడే అవకాశం ఉన్నందున వెంటనే స్పందించేలా ఉండాలని ఆ శాఖను ఆదేశించారు. ప్రజలందరూ సురక్షితమైన ప్రదేశాలలో ఉండి, అత్యవసర పరిస్థితులుంటే తప్ప ఇళ్ళ నుంచి బయటకు రావద్దని సూచించారు. ఎమ్మార్వో ప్రసాద్, ఎంపీడీవో భార్గవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మైక్‌తో పోలీసుల అవగాహన

**కైకలూరు:** మొంథా తుఫాన్ ప్రభావంతో రానున్న మూడు రోజులు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నం దున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కైకలూరు రూరల్ సీఐ వి. రవికుమార్ హెచ్చ రించారు. ఆదివారం కైకలూ రు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి పోలీసుస్టేషన్ పరిధిలో మైక్ ద్వారా తుపాన్ పై ప్రజలకు ప్రచారం చేస్తూ అవగాహన కల్పించారు. సోమ, మంగళ, బుధవారాల్లో తుపాన్ ప్రభా వంతో 100 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని దాంతో పాటు భారీ వర్షం చోటు చేసుకుంటుందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండి విద్యుత్ స్తంభాలు, తీగలు, సెల్‌టవర్లు, చెట్లు కింద ఉండవద్దని హెచ్చ రించారు. తుపాన్ ప్రభావంతో పిడుగులు పడతాయ ని, ప్రజలు అప్రమత్తంగా ఉండి లోతట్టు ప్రాంతాల్లో ముంపు బారిన పడే చోట లేకుండా సురక్షిత భవనాల్లో ఉండాలని సూచించారు. ఎక్కడైనా తుఫాన్ ప్రభావం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురైతే తక్షణమే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారాన్ని అందించాలన్నారు. అలాగే కొల్లేరు లంక గ్రామాల్లోని ప్రజలు చేపల వేటకు సరస్సులోకి వెళ్లవద్దని అలాగే పడవ ప్రయాణాలు చేయవద్దని హెచ్చరించారు.



పెదలంక పల్లిపాలెంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జయమంగళ

## మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్సీ జయమంగళ

**కలిదిండి:** తుఫాతో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. ఆదివారం ఉప్పుటేరు తీర గ్రామాలైన కొండంగి, మట్టగుండ, పెదలంక, పెదపుట్లపూడి గ్రామాల్లో పర్యటించారు. మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే మూడు రోజులు సముద్రం, ఉప్పుటేరులోకి మత్స్యకారులు వేటకు వెళ్లవద్దన్నారు. ప్రకృతి విపత్తులు సంభవిస్తే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలన్నారు. జనసేన మండల అధ్యక్షుడు బెల్లంకొండ వెంకన్న బాబు, డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ అక్కుల వెంకటాచలం, దున్న భోగేశ్వరరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చక్రవర్తి, కొల్లాటి కొత్తరాజు తదితరులు పాల్గొన్నారు.



కైకలూరు వెలమపేటలో ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజబాబు

## ముంపు ప్రాంతాల పరిశీలన

కైకలూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ముంపు ప్రాంతాల్లో నీరు లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఎంపీడీవో ఆర్. రాజబాబు ఆదేశించారు. ఆదివారం కైకలూరు పట్నంలోని వెలమపేటకాలనీలో, వెలమపేట ఎంపీయూపీ స్కూల్ వద్ద, పుల్లవా డ్రెయిన్, గోపవరంలోని వంతెన వద్ద పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వెలమపేట కాలనీలోని అంతర్గత ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారులు సైతం నీటమునిగి ప్రజలు వారంలో రోజులుగా ఆ నీటిలోనే రాకపోకలను సాగిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలుచోట్ల వీధి కుళాయిలు ఆ ముంపు నీటిలో ఉండడంతో ప్రజలు తాగునీరు పట్టుకునేందుకు కూడా అవకాశం కూడా లేదని అధికారులకు వివరించారు. దీంతో వర్షపునీరు తరలించేందుకు ఏర్పాటుచేసిన చిన్నపాటి విద్యుత్ మోటార్లను తక్షణమే వాటిస్థానంలో పెద్దమోటార్లును ఏర్పాటుచేసి నీటిని యుద్ధప్రాతిపాదికన బయటకు తరలించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ వనజాక్షి, డిప్యూటీ ఎంపీడీవో అప్పారావు, పశుసంవర్ధకశాఖ ఏడీ ముస్తాఫాఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీరంగం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు

## సాగు భూములకు పట్టాలివ్వాలి

నూజివీడు టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం నూజివీడులో వ్యవసాయ కార్మికసంఘం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ వ్యవసాయ కార్మికసంఘం, సీపీఐ పోరాటాలతో ప్రజలకు దక్కిన భూమికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, రాష్ట్ర నాయకుడు చలసాని రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, మడుపల్లి సత్యనారాయణ, నాగేంద్రరావు, చెంగల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత ఆందోళన.. హడావుడిగా కోతలు



చాట్రాయిలో హడావుడిగా యంత్రాలతో వరి కోతలు

చాట్రాయి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ భయంతో రైతులు గజగజ వణికిపోతున్నారు. నోటి దగ్గరకు వచ్చిన వరి పంట తుఫాన్‌కు నాశనం అవుతుందేమోననే భయంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎలాగైనా పంట దక్కించుకోవాలనే తపనతో ఉరుకులు పరుగులు పెడుతూ ఖర్చుకు కూడా వెనకాడకుండా ట్రాక్ మిషన్లతో హడావుడిగా వరి కోతలు కోసి, వెంటనే పచ్చి ధాన్యం కాటాలు వేస్తున్నారు. పచ్చి ధాన్యం 75 కేజీల బస్తా రూ. 1450కి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. వరి పొలాల్లో ఎక్కడ చూసినా మిషన్లతో వరి కోతలు, ట్రాక్టర్లతో ధాన్యం తోలకాల సందడి కన్పిస్తున్నది. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 12 వేల ఎకరాల్లో వరిసాగు జరగ్గా ఇప్పటికి సుమారు 10 శాతం మాత్రమే వరికోతలు జరిగాయి. తుఫాన్ బారి నుంచి తమ పంటను కాపాడాలని రైతు కుటుంబాలు దేవుళ్ళకు మొక్కుతున్నాయి.





రహదారిపై చేరిన సాగర్ నీరు (ఫైల్)





గుంతలను పూడ్చిన దృశ్యం

## నీరు తొలగింపు.. గుంతల పూడ్చివేత

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

ముసునూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్లకుంట పరిధిలో గల గుర్రాలమ్మ, గుర్రాలయ్య ఆలయం మీదుగా నూజివీడు వెళ్ళే రహదారిలో ప్రమాదకరంగా ఉన్న గుంతల్లో ఆదివారం నీటిని తొలగించి, కంకర వేసి సమస్యను పరిష్కరించారు. వేంపాడు మేజర్ కాలువ గోడకు రంధ్రాలు పడి నీరు వృధాగా పోవడంతోపాటు రహదారిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న క్రమంలో ఈ నెల 12న నీటి వృథా పట్టదా..? శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించింది. దీనిపై మంత్రి కొలుసు పార్థసారధి సమస్యను పరిష్కరించాలని వేంపాడు మేజర్ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ, ఎన్‌ఎస్పీ డీఈ విజయలక్ష్మి, ఆర్‌అండ్‌బీ డీఈ బాబురావును ఆదేశించారు. అయితే చైర్మన్, అధికారులు కాలువ గోడకు పడిన రంధ్రాల నుంచి వచ్చే నీరును రహదారిపైకి రాకుండా ఎక్స్‌కవేటర్‌తో చిన్నపాటి కాలువను తీసి, పక్కన ఉన్న కుంటలోకి వెళ్ళేలా చేశారు. అలాగే రహదారిపై ఏర్పడిన ప్రమాదకరమైన గుంతలను కంకరతో పూడ్చి రోలింగ్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం తుపాన్ కారణంగా కాలువకు నీటిని నిలుపుదల చేశారని, త్వరలో ఈ రంధ్రాలను పూర్తిగా మూసివేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు నెలలుగా ఉన్న సమస్య పరిష్కారం కావడంతో వాహనదారులు, స్థానికులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.



ఆగిరిపల్లిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

## అ'పూర్వ' సమ్మేళనం

ఆగిరిపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మే ళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించిన మిత్రులను ఘనంగా సన్మానించారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు జె విజయ్‌కుమార్ పాల్గొన్నారు. చిమట శ్రీనివాసరావు, గిరి, సతీష్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## అధికార యంత్రాంగం అప్రమత్తం


(5వ పేజీ తరువాయి)


కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ నంబర్ 9491041419, టోల్ ఫ్రీ నంబర్ 18002331077 లకు ఫోన్ చేసి ప్రజలు తుపాన్ పరిస్థితి తెలుసుకోవచ్చని, సహాయం పొందవచ్చన్నారు. ప్రజలకు అవసరమైన సేవలందించేందుకు ప్రతి గ్రామానికి ఒక నోడల్ అధికారిని నియమిం చాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. నదులు, వాగుల్లోకి ప్రజలు వెళ్లకుండా చూడాలని, కల్వర్టులు, కాజ్‌వేలు, వాగులకు ప్రజలు దాటకుండా హెచ్చరిక బోర్డులు, సిబ్బందిని నియ మించాలన్నారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్ళకుండా అప్రమత్తం చేయాలన్నారు. తీవ్ర గాలులకు విద్యుత్ స్థంభాలు కూలే అవకాశం ఉన్నందున సం బంధిత అధికారులు తక్షణ చర్యలకు సిద్ధంగా ఉండా లన్నారు. జిల్లా, డివిజన్ స్థాయిల్లో విద్యుత్ సంస్థ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. తుఫాన్ సహాయక కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరాకు అంత రాయం లేకుండా జనరేటర్లను ఏర్పాటు చేయా లన్నారు. తుఫాను పునరావాస కార్యక్రమాలకు ఎస్‌డీ ఆర్ ఎఫ్ బలగాలు జిల్లాకు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్ వినూత్న, ఆర్డీవోలు అంబరీష్, రమణ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**జిల్లాలో భారీ వర్షాలు**

జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆదివారం మబ్బులతో కూడిన వాతావరణంతో వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా కైకలూరు మండలం లో 41.6 మి.మీ. నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 3.7 మిల్లీమీటర్లు నమోదైంది. మండవల్లిలో 24.8, కలిదిండిలో 20.2, భీమడోలులో 11.8, కామవరపు కోటలో 2.2, లింగపాలెంలో 2.2, ముదినేపల్లిలో 1.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

## నేడు ఏలూరుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ రాక

ఏలూరుసిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో ముందస్తు ఏర్పాట్లను సమీక్షించేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి, ఏలూరు జిల్లా ఇంచార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 27వతేదీ సోమవారం ఉదయం ఏలూరు రానున్నారని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మంత్రి మనోహర్ ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను సందర్శించితుఫాను తీవ్రత, ప్రభావం, జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న ముందస్తు చర్యలను సమీక్షిస్తారు.

## ఎక్కడి బస్సులు అక్కడే గప్‌చుప్


(5వ పేజీ తరువాయి)


ఉన్నాయి. శనివారం రాత్రి నుంచి కొన్ని కార్యాల యాల్లో ఆ బస్సులు లేవని చెబితే.. మరి కొంత మంది టిక్కెట్లు అయిపోయాయని చెబుతున్నారు. వాస్తవానికి ఆ బస్సులను శనివారం రాత్రి నిలిపివేసినట్టు, ఆది వారం కూడా కొన్ని బస్సులు నిలిపి వేసినట్లు తెలు స్తోంది. రవాణాశాఖ అధికారులు తనిఖీలు కొనసా గిస్తున్నారనే సమాచారం, కేసులు నమోదు చేస్తారనే ఆలోచనతో ముందుగానే బస్సులను తిప్పకుండా నిలిపివేసినట్లుగా తెలుస్తోంది. కొన్ని బస్సులకు సరైన రికార్డులు లేకపోవడం వల్ల నిలిపివేశారనే ప్రచారం కూడా జరుగుతుంది. ఎక్కడి బస్సులు అక్కడే గప్‌చుప్ అనే ధోరణిలో ప్రైవేటు బస్సుల నిర్వాహకులు కొంత మంది ఈ విధంగా బస్సులు తిప్పకుండా నిలిపి వేసినట్లుగా స్పష్టమవుతుంది.

**నిరంతర నిఘా**

ప్రైవేటు ట్రావెల్ బస్సులపై జిల్లా రవాణా శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు కొనసాగిస్తున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ 28 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.1.91లక్షల జరిమానా విధించారు. డిప్యూటీ ట్రాన్స్ పోర్టు కమిషనర్ షేక్ కరీమ్ ఆదేశాల మేరకు జంగా రెడ్డిగూడెం ఆర్టీవో ఎస్ఎస్ రంగనాయకులు, ఏలూరు ఆర్టీవో ఎస్‌బి శేఖర్ పర్యవేక్షణలో రవాణాశాఖ అధికారులు జంగారెడ్డిగూడెం, ఏలూరు సమీపం లో కలపర్రు టోల్‌గేటు వద్ద ప్రైవేటు కాంట్రాక్టు క్యారేజీ బస్సులపై ప్రత్యేక తనిఖీలను నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు చూపని, అత్యవసర ద్వారం, అగ్నిమాపక పరికరాలు, ప్యాసింజర్ లిస్టులేని, తదితర ఉల్లంఘనలపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలు ప్రతి రోజూ కొనసాగిస్తామని డీటీసీ కరీమ్ తెలిపారు.